Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 16.02.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 37 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## జగన్ ప్రయోగించిన...
# రాజీనామాస్త్రం



- 'దేశం' డ్రామాలకు సరైన చెక్
- ప్యాకేజీ చాలన్న చంద్రబాబుకు షాక్
- జగన్ ప్రకటనతో సంధిగ్ధంలో టీడీపీ

*ఆంధ్రప్రదేశ్ విభజన హామీలపై పార్లమెంటులో ఎవరి నాటకాలు వాళ్లాడుతున్నారు. ప్రత్యేకహోదాపై ఎవరి పిల్లిమొగ్గలు వాళ్లేస్తున్నారు. ఒక పార్టీ వాళ్ళు పార్లమెంటు బయట పగటి వేషాలేస్తుంటే.. పార్టీ పెట్టి కూడా ఎన్నికల్లో పోటీ చేయని నటనాయకుడొకరు జేఏసీ అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. ఇలాంటి పగటి వేషాలకు, ఇట్లాంటి జేఏసీ యాక్షన్‌లకు కేంద్రం తలవంచుతుందా? ప్రధాని నరేంద్ర మోడీ తల దించుతాడా...?*

టీడీపీ, పవన్‌కళ్యాణ్ రాజకీయ డ్రామాలకు చెక్‌పెడుతూ ప్రత్యేకహోదాపై ప్రతిపక్ష నేత వై.యస్. జగన్మోహన్‌రెడ్డి సంధించిన రాజీనామాస్త్రం ఇప్పుడు అధికారపక్షంలో గుబులు రేపుతోంది. పిల్లిమొగ్గలు, పగటి వేషాలతో కాకుండా ఆయన ప్రత్యేకహోదా కోసం నేరుగా కేంద్రంతో కయ్యానికే సిద్ధమైయ్యారు. పార్లమెంటు వేదికగానే ప్రత్యేకపోరుకు శ్రీకారం చుట్టాడు. ఏపికి ప్రత్యేకహోదా కోసం అవసరమైతే తమ ఎంపీల చేత రాజీనామా చేయిస్తానని జగన్ గతంలోనే ప్రకటించి వున్నాడు. చివరి బడ్జెట్‌లో కూడా ఎన్డీఏ ప్రభుత్వం ఏపికి ప్రత్యేకహోదా కాదు కదా సరైన న్యాయం కూడా చేయలేని పరిస్థితులలో 'ప్యాకేజీ వద్దు – ప్రత్యేకహోదానే ముద్దు' అంటూ ప్రజాసంకల్పయాత్రలో భాగంగా నెల్లూరు జిల్లా కలిగిరిలో జరిగిన సభలో ప్రత్యేకపోరుకు శ్రీకారం చుట్టారు. ప్రత్యేకహోదాపై పార్టీ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను ఆయన అశేష ప్రజానీకం సమక్షంలోనే ప్రకటించారు. మార్చి 1వ తేదీ నుండి వైయస్సార్

(మిగతా 11వ పేజీలో)

## ఆదాయంలో బాబు టాప్ అభివృద్ధిలో రాష్ట్రం ఫ్లాప్



### నెం.1 సి.ఎం
### పనిలో కాదు... సొంత ఆస్తుల్లో...

*ఆయన వేగంగా నడుస్తాడు... ఆయన వేగంగా పని చేస్తాడు... ఆయన కదలికలు వేగంగా వుంటాయి. ఆయన ఆలోచనలు వేగంగా వుంటాయి. ఏపిని అన్ని రంగాలలో నెంబర్‌వన్‌లో వుంచాలన్నది ఆయన తాపత్రయం. ఏపిని ఆయన ఎక్కడికో తీసుకుపోవాలనుకుంటాడు... కాని ఈ రాష్ట్రం అక్కడిదాకా పోదు... ఇక్కడే వుంటుంది. కాబట్టే ఈ రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిపోయింది. ఆయన వేగంగా ముందుకెళ్ళబట్టే దేశంలోనే ధనిక సీఎంల జాబితాలో నెంబర్ వన్ ర్యాంకును సాధించాడు. ఆ విధంగా అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలో నిలపలేకపోయినా అత్యధిక సంపన్నుల సీఎంల జాబితాలో తాను మాత్రం మొదటి స్థానంలో నిలిచాడు.*

ఇటీవల ఏడిఆర్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో 177కోట్ల ఆస్తులతో ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోని 31మంది (మిగతా 11వ పేజీలో)

## చంద్రుడి డైరెక్షన్‌లో పవన్ యాక్షన్ థ్రిల్లర్...
# జె.ఏ.సి



### ఎన్నిరోజులు ఆడుతుందో?

*రాష్ట్ర రాజకీయాలలో చంద్రబాబుకు అవసరమైనప్పుడు మాత్రమే తెరమీదకొస్తాడని పేరున్న పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ మరోసారి సరికొత్త యాక్షన్ థ్రిల్లర్ స్క్రీన్‌ప్లేతో తెరమీద కొచ్చాడు. దీనిపేరు జాయింట్ యాక్షన్ కమిటీ! తెలంగాణ ఉద్యమ సమయంలో జేఏసీల పాత్రేమిటో చూసాం. తెలంగాణ జేఏసీ నాయకుడు కోదండరామ్ రాష్ట్రసాధన లక్ష్యంగా పోరాడితే సమైక్యాంధ్ర జేఏసీ నాయకుడు అశోక్‌బాబు ఉద్యమాన్నే తాకట్టుపెట్టడం చూసాం.*

ప్రత్యేకహోదా కోసం, విభజన హామీల అమలు కోసం జేఏసీని ఏర్పాటు చేసినట్లు పవన్ కళ్యాణ్ చెబుతున్నారు. జేఏసీ కోసం పార్టీనిపెట్టి ఇక రాజకీయాలలో పోరాడలేనని చేతులెత్తేసిన జయప్రకాశ్ నారాయణను, మాజీఎంపీ, రాష్ట్రంలోని అన్ని సమస్యలపై మంచి అవగాహన వున్న నాయకుడు ఉండవల్లి అరుణ్‌కుమార్‌లను సంప్రదించాడు. ఇద్దరూ మేధావులే! ప్రజాసమస్యల పట్ల అవగాహన, (మిగతా 11వ పేజీలో)



# కల్లాల్లో ధాన్యం... ధర అధ్వాన్నం!

రైతు దేశానికి వెన్నెముక. రైతేరాజు, జై కిసాన్, అన్నదాత లేనిదే ఈ దేశం లేదు... ఈ మాటలన్నీ వినడానికి ఎంతో ఇంపుగా ఉంటాయి. కాని ఆచరణలోకి వచ్చేసరికి రైతు పరిస్థితి నైట్‌వాచ్‌మెన్ కంటే ఘోరంగా ఉంటుంది. రైతుకు సరైన ఆదరణ, సముచిత ప్రాధాన్యత లేక, వ్యవసాయం చేసేవారికి సరైన హోదా, గౌరవం లేక రానురాను వ్యవసాయం చేసేవాళ్లే తగ్గిపోతున్నారు. రైతులకు ఏ ప్రభుత్వంలోనూ న్యాయం జరక్కపోతుండడం మూలంగా అసలు వ్యవసాయం చేయాలనే ఉద్దేశ్యమే కనుమరుగవుతుంది. రైతు ఆరుగాలం కష్టించి పెట్టుబడి పెడితే ఫలసాయం చేతి కొస్తుంది. కాని, అతను ఉత్పత్తి చేసినప్పుడు అతని చేతికొచ్చే రేటుకు, మార్కెట్‌లో అదే ఉత్పత్తి వినియోగదారుడి చేతిలోకి వెళ్ళినప్పుడు అతను చెల్లిస్తున్న రేటుకు బండకు, కొండకు ఉన్నంత వ్యత్యాసముంటుంది.

ఉదాహరణకు ఒక రైతు తన పొలంలో పండిన కొబ్బరికాయలను కాయ ఒకటి 5రూపాయల లెక్కన అమ్మాడనుకుందాం. అదే రైతు ఊర్లోకి వచ్చి దానిని కొనబోతే పాతికరూపాయలు చెబుతారు. ఏడాది పొడవునా కష్టపడి, పెట్టుబడిపెట్టి దిగుబడి సాధించిన రైతుకేమో 5రూపాయలు, ఒక్కరోజు పెట్టుబడిపెట్టి దానిని కొన్న వ్యాపారులకేమో 20రూపాయల ఆదాయం. ప్రతి పంటలోనూ రైతులు ఇదే విధంగా నష్టపోతున్నారు.

ముఖ్యంగా జిల్లాలో ఇప్పుడు వరికోతలు మొదలుకానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 5లక్షల ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు.

## రైతుల కష్టం... దళారులకు అదృష్టం




గూడూరు, నాయుడుపేట డివిజన్‌లలో కొంత ముందుగా పైర్లు వేయడంతో ఈ నెలాఖరుకు కోతలు పూర్తి కానున్నాయి. మిగతా ప్రాంతాలలో వచ్చే నెలలో కోతలుంటాయి. వరి కోతలు మొదలవగానే దళారులు రాజ్యమేలుతుంటారు. పంట పండించిన ప్రతి రైతు తన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకెళ్ళి అమ్ముకోలేడు. అలాగని గిట్టుబాటు ధరలు వచ్చేవరకు గోడౌన్‌లలో దాచుకోలేడు. దానికి తగ్గ గోడౌన్‌లు కూడా లేవు. పైర్లు వేయడానికే అప్పులు తెచ్చి వుంటారు. ఈ అప్పులు తీర్చుకోవడానికి కళ్లాల్లోనే ధాన్యాన్ని దళారులు చెప్పిన రేటుకే తెగనమ్ముకుంటుంటారు. జిల్లాలో వరికోతలు మొదలు కానున్నాయి. ఇప్పటికే దళారులు రంగప్రవేశం చేశారు. మార్కెట్‌లో రేటుకు కళ్లాల్లో వాళ్ళు కొంటున్న రేటుకు దాదాపు వెయ్యి నుండి 1500 రూపాయల దాకా తేడా వుం టుంది. ఎకరాకు నాలుగు పుట్లు పండితే దాదాపు అయిదారువేలు అక్కడే నష్టపోతున్నాడు. అధికారులు చొరవ తీసుకుని రైతులకు అవగాహన కల్పించి, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వారి కష్టానికి మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలి. సేద్యంపై రైతులు విరక్తి పెంచుకోకుండా, వారికి తగిన న్యాయం చేయాలి!

## గత యేడాదే మేలు

**- వైయస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు కొరపాటి మురళీనాయుడు**



ఈ కేంద్ర బడ్జెట్‌లో రైతులకు పెద్దపీట వేసామన్నారు. కాని, రైతులకు ఇచ్చే రాయితీలపై క్లారిటీ లేదు. వారి పంటలకు మద్దతుధర ఏ రూపంలో ఇస్తారో చెప్పలేదు. గత యేడాది పుట్టికి 17,500రూపాయల దాకా గిట్టుబాటు ధర వచ్చింది. కానీ, ఈ సంవత్సరం 14,000రూపాయలకు మాత్రమే కొంటున్నారు. తరుగు, చెత్త అంటూ దళారులు రైతులను మోసం చేస్తున్నారు. ఈ యేడాది ఎకరాకు 30వేల రూపాయల దాకా పెట్టుబడి అయ్యింది. సొసైటీల నుండి రైతులకు ఎరువులు సక్రమంగా అందలేదు. అధికారులు జిల్లా అంతటా దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలి.

## పాతిక కోట్లతో టిపి గూడూరులో అభివృద్ధి పనులు

టిపి గూడూరు మండలానికి సంబంధించి సిపిఎస్ పురం, మండపం తదితర ప్రాంతాల్లో ఎన్ఆర్ఇజిఎస్, సిఎస్ఆర్ నిధులు వగైరాలన్నీ కలిపి సుమారు 25 కోట్ల 32లక్షల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి సోమిరెడ్డి అన్నారు. ఈ నెల 11న ఆయన మండపం పంచాయతీలో రిలయన్స్ పవర్ ప్లాంట్‌కు భూములు అందించిన రైతులకు నష్టపరిహారాన్ని అందించే కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఎకరాకు సుమారు 6లక్షల పైన విలువతో 35 మంది రైతులకు 2 కోట్లా 23 లక్షల 31 వేలా 929 రూపాయలను చెక్కుల రూపంలో అందించడం జరిగిందన్నారు. కృష్ణపట్నం పోర్టు, వివిధ కంపెనీల ఏర్పాటుకై సేకరించిన 5,800 ఎకరాలకు సంబంధించి రైతులకు నష్టపరిహారం చెల్లింపు విషయంలో అప్పటి ప్రభుత్వంతో పలుసార్లు చర్చించిన అనంతరం సుమారు 7లక్షలా 70వేల రూపాయలు వంతున అందించడం జరిగిందన్నారు. మిగిలిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లింపు విషయంలో త్వరితగతిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 62 శాతం మంది ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారని, వారికి వ్యవసాయ మంత్రిగా సేవచేసే అవకాశం రావడం పూర్వజన్మ సుకృతమన్నారు. రాష్ట్రం ఆర్థికలోటులో ఉన్నప్పటికీ రైతుల రుణ మాఫీ విషయంలో 3వ విడత మాఫీకై ఇప్పటిదాకా 3,300 కోట్లు వెచ్చించడం జరిగిందని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీమతి హరిత, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు చంద్రనాయక్, తహశీల్దార్ పుల్లయ్య, ఎంపీటీసిలు శ్రీనివాసులు, వెంకయ్య, సర్పంచ్ సుబ్బారావు పాల్గొన్నారు.



రైతులకు చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

## శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయానికి భారీ ఆదాయం

- **వేలం పాటల ద్వారా పెరిగిన రాబడి**

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి రాబడి బాగా పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆదాయం బాగా పెరిగిందని ఆలయ ఇ.ఓ వేగూరు రవీంద్రరెడ్డి తెలిపారు. కొబ్బరికాయల విక్రయం, కొబ్బరిచిప్పల సేకరణ వేలంపాటల ద్వారా గత ఏడాది 23.05 లక్షలు ఆదాయం రాగా, ఈ ఏడాది 32.25 లక్షలు వచ్చిందన్నారు. చీరల సేకరణ హక్కు ద్వారా గత ఏడాది 6.90 లక్షలు రాగా, ఈ ఏడాది వేలంలో 9 లక్షలకు దక్కించుకున్నారని, అదేవిధంగా పుస్తకాలు, సీడీలు విక్రయహక్కు ద్వారా గత ఏడాది 1.41 లక్షలు ఆదాయం రాగా, ఈ ఏడాది 3.50లక్షలకు వేలం పాడుకున్నారని తెలిపారు. పాదరక్షలు భద్రపరచడానికి ఇచ్చే హక్కులో ఈ ఏడాది 2.30లక్షలకు వేలంపాటలో పాటదారులు దక్కించు కున్నారన్నారు. కల్యాణమండపం, పూల దుకాణాల నిర్వహణకు సంబంధించిన వేలం పాటలు వేయిదా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రత్నం జయరామ్‌తో పాటు పలు ఆలయాలకు చెందిన ఇ.ఓలు, భక్తులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో చండీహోమం

మాఘమాసం పుణ్యకాలాన్ని పురస్కరించకుని శ్రీకృష్ణ ఆంజనేయ దత్తసాయి భక్తసమాజం ఆధ్వర్యంలో ఈ నెల 11న ఎంతో భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. నెల్లూరు వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తొలుత చండీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అమరావతికి చెందిన వేదపండితుడు ఆల్తూరు భరధ్వాజ సిద్ధాంతి శిష్యులు శాస్త్రబద్ధంగా చండీ హోమం నిర్వహించారు. బిజ్జం విజయకుమార్‌రెడ్డి, వాణి మల్లేశ్వరి దంపతులు ఈ కార్యక్రమానికి కార్యనిర్వాహకులుగా వ్యవహరించగా, మందిరం కమిటీ ధర్మకర్త సిహెచ్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎస్.సుబ్బరామరాజు, కార్యనిర్వాహకులు కొమరా మాలకొండయ్య, కోశాధికారి శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్యనాయుడు, వేణుబాబు పాల్గొని కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## హేమంత్‌రెడ్డి కుటుంబానికి జగన్ పరామర్శ

వైయస్సార్‌సీపీ టిపి గూడూరు నాయకుడు నాయుడు హేమంత్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆయన కుటుంబసభ్యులను ఈ నెల 14న ఫోన్‌లో పరామర్శించారు. మృతుడు హేమంత్‌రెడ్డి సతీమణి ప్రస్తుతం మాచర్లవారిపాళెం సర్పంచ్‌గా, హేమంత్‌రెడ్డి తల్లి టిపి గూడూరు ఎంపీపీగా కొనసాగుతున్నారు. హేమంత్‌రెడ్డి హఠాన్మరణం తెలుసుకున్న సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ విషయాన్ని వై.యస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. హేమంత్‌రెడ్డి సతీమణి వినీలాకు జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్ చేసి ఓదార్చారు. పార్టీ ఎల్లవేళలా మీ కుటుంబానికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

## రాష్ట్రంలో మరో రెండు బ్యాడ్మింటన్ అకాడమీలు

రాష్ట్రంలో నెల్లూరులోనే బ్యాడ్మింటన్ అకాడమీ ఉందని, క్రీడాకారుల అవసరాల దృష్ట్యా విజయవాడ, విశాఖపట్నంలలో మరో రెండు అకాడమీలు ప్రారంభించేలా ప్రభుత్వానికి సిఫార్స్ చేస్తామని భారత బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి కేసీ పున్నయ్యచౌదరి అన్నారు. నెల్లూరులో జరుగుతున్న అకాడమీ రాష్ట్ర స్థాయి ఎంపికలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని 12జిల్లాలకు సంబంధించి బ్యాడ్మింటన్ ఎంపికలకు 106మంది క్రీడాకారులు పాల్గొన్నారని, అందులో 35మందిని ఎంపిక చేసామన్నారు. వీరిలో నైపుణ్యంగల 20మందిని మాత్రమే ఎంపిక చేస్తామన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అకాడమీ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తుందని తెలిపారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.వి.రమణయ్య, కోచ్ సుధాకర్‌రెడ్డి, మద్దిపాటి ప్రసాద్‌రావు, ఎన్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం

నెల్లూరు విరాట్‌నగర్‌లోని శ్రీ గాయత్రీ సమేత విశ్వకర్మ భగవాన్, శ్రీ గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవం ఈనెల 13న నేత్రపర్వంగా జరిగింది. అర్చకస్వాములు శాస్త్రోక్తంగా దంపతుల సమేతంగా పాల్గొన్న భక్తులచే కళ్యాణాన్ని జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తులకు కళ్యాణాన్ని జరిపించారు. విశ్వబ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు కందుకూరు చెంగయ్య ఆచారి ఆధ్వర్యంలో ఉభయకర్త బల్లవోలు రమణయ్య ఆచారి దంపతులు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పట్టణ విశ్వబ్రాహ్మణ ప్రధానకార్యదర్శి ఇందుకూరు రమేష్‌కుమార్ ఆచారి, ఉపాధ్యక్షులు అలిమేలి శ్రీహరిఆచారి, కోశాధికారి దండపాణి సురేష్ ఆచారి, కార్యనిర్వాహక కార్యదర్శి పేట మాధవయ్య ఆచారి పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.

## చెంగాళమ్మకు రంగారెడ్డి జిల్లా జడ్జి పూజలు

సూళ్లూరుపేటలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని ఈ నెల 10న రంగారెడ్డి జిల్లా జడ్జి వీరరాజురెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్లురెడ్డి న్యాయమూర్తికి సాదరస్వాగతం పలికి, అమ్మవారి వద్ద ప్రత్యేకపూజలు నిర్వహింపజేశారు.

## గురుశిష్యుల బంధానికి వేదిక...

# నాగభైరవ అవార్డు వేడుక



*ఈ సమాజంలో తల్లిబిడ్డల ప్రేమకు గుర్తుగా, భార్యాభర్తల బంధానికి ప్రతీకగా, స్నేహితుల మధ్య అనుబంధానికి వేదికగా... ఎన్నో దినోత్సవాలున్నాయి. కాని నెల్లూరులో గురుశిష్యుల మధ్య వున్న ఆత్మీయానుబంధాలకు ప్రతిరూపంగా జరిగే వేడుక ఒకటి ఉంది. అదే డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు అవార్డు ప్రదానోత్సవం.*

*గురువు పేరుతో గురువు జ్ఞాపకాలతో శిష్యులు నిర్వహించే పండుగ ఇది. నాగభైరవ కోటేశ్వరరావుకు వేలసంఖ్యలో శిష్యులుండొచ్చు. ఆయన పేరును నిలబెట్టేలా వీరు ఎదిగి వుండొచ్చు. కాని తన గురువు నాగభైరవ పేరును గుండెల్లో దాచుకున్న శిష్యులు మాత్రం కొందరే ఉన్నారు. వారిలో నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, 'మాట' అనే ఒక దీర్ఘకవితతో ఆ రెండుక్షరాలకున్న శక్తిని ప్రపంచానికే తెలియజెప్పిన రచయిత చిన్ని నారాయణరావు ఒకరైతే, రెండవ వాడు తెలుగు సినీ వినీలాకాశంలో పాటలు, మాటల రచయితగా తన సౌరభాలను గుభాళింపజేస్తున్న వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్. ఏ శిష్యులూ ఏ గురువుకూ చేయని, చేయలేని మహాకార్యాన్ని ఈ శిష్యులు చేస్తున్నారు. తమ గురువు పేరు మీద అవార్డును నెలకొల్పి ప్రతి ఏటా సాహితీరంగంలో విశిష్ట సేవలందించిన వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తున్నారు. అలా తమ గురువు పేరును ప్రతి ఏటా తలచుకునేలా చేస్తున్నారు.*

వరుసగా 9వ ఏట ఈనెల 11వతేదీ సాయంత్రం నెల్లూరు పురమందిరంలో నాగభైరవ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు అవార్డు కమిటి సభ్యులు. ఈ ఆధునిక కాలంలో కూడా, బూతు సాహిత్యం సినీ పరిశ్రమను కలుషితం చేస్తున్న రోజుల్లో కూడా సాహిత్య విలువలు పెంచుతూ సాంప్రదాయ మాటలతో పాటలు అల్లుతున్న ప్రముఖ సినీ గేయరచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రికి ఈ ఏడాది డాక్టర్ నాగభైరవ అవార్డును అందజేశారు. 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రముఖ సేవాతత్పరుడు, విపిఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజధాని కమిటి సభ్యులు, మాజీ శాసనసభ్యులు బీద మస్తాన్‌రావు, మాజీమంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డిలు అతిథులుగా హాజరై సిరివెన్నెలను నాగభైరవ అవార్డుతో ఘనంగా సత్కరించారు. అలాగే నాగభైరవ స్ఫూర్తి అవార్డులను వంజవాక సతీష్‌రెడ్డి, కొండెపోగు బి.డేవిడ్ లివింగ్‌స్టన్, పి.లక్ష్మణరావు, కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు, ఆవాల శారదలకు ప్రదానం చేయగా, డా॥ నాగభైరవ సాహితీ అవార్డును కోగండి విజయ్‌బాబుకు, డాక్టర్ నాగభైరవ అధ్యాపక అవార్డును విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ కాళిదాస పురుషోత్తంకు అందజేశారు. కాగా, ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా నాగభైరవ కోటేశ్వరరావు కుమార్తెలు కూకట్ల రాజ్యలక్ష్మి, ధూళిపాళ్ళ రవీంద్ర కుమారి, మన్నం మనోరమలు విచ్చేసారు.

కార్యక్రమ నిర్వాహకులు చిన్ని నారాయణరావు మనుమడు చిన్ని శ్రీకేతన్ ప్రార్థనతో సభ ప్రారంభమైంది. సభా ప్రారంభానికి ముందు కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో సంగీత విభావరి జరిగింది. ఇందులో పాల్గొన్న గాయనీగాయకులు సిరివెన్నెల రచించిన పాటలతో పాటు మరికొన్ని మధురగీతాలను ఆలపించి ఆహూతులను మంత్ర ముగ్ధులను చేశారు.

ఈ వేడుకలో ప్రసంగించిన వక్తలు నాగభైరవను, అవార్డు కమిటి సభ్యులను, సిరివెన్నెలను తమ మాటల్లో



అభినందించారు.

సభాధ్యక్షులుగా వ్యవహరించిన 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ సిరివెన్నెల మాటల్లో ఉత్తేజం, ఆయన పాటల్లో ఆవేశం ఉంటాయని, ఆయన ఏ పాట వ్రాసినా అందులో యువతరానికి ఓ సందేశం ఉంటుందని, యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. ప్రతీమనిషి తాను ఏ ప్రాయంలో వున్నా యువ భావనతో ఆలోచన చేయాలని, అప్పుడే ఆ వ్యక్తిలో నిత్య నూతన యవ్వనం పెల్లుబుకుతుందని 'సిరివెన్నెల' పలుమార్లు తన ప్రసంగాలలో చెప్పడం ఆయన ఆలోచనా సరళికి అద్దం పడుతుందని అన్నారు. నిత్య నూతన యువ సాహితీ ప్రేమికుడిగా సిరివెన్నెలను ప్రభు కీర్తించాడు. సినిమా పేరుని ఇంటి పేరుగా మార్చుకున్న సీతారామశాస్త్రి పైన సిరివెన్నెల ప్రభావం ఏ స్థాయిలో ఉందో మనం ఊహించుకోవచ్చని అన్నారు. సాహితీ ఉద్దండుడు కీ॥శే॥ నాగభైరవ అవార్డుకు ఈ యువ సాహితీశ్రామికుడు అన్ని విధాలా అర్హుడని శివప్రభాత్‌రెడ్డి అన్నాడు. 32 సంవత్సరాలుగా మూడువేల పాటలు వ్రాసిన సిరివెన్నెల ప్రతీ పాటలోనూ వైవిధ్యం కనపరచడం ఓ విశేషమన్నారు.

రాజధాని కమిటి సలహా సంఘ సభ్యులు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా నిర్విరామంగా ఈ అవార్డులను అందజేస్తున్న ఆయన శిష్యులు వెన్నెలకంటి, చిన్ని నారాయణరావులకు అభినందనలు తెలుపుతున్నానన్నారు.

రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సీతారామశాస్త్రి ఏ పాట రాసినా యువత భవిష్యత్తులో ఎలా నడుచుకోవాలన్న సందేశం ఉంటుందన్నారు. గతంలో తాను సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు నంది అవార్డును బహుకరించినట్లు గుర్తు చేసుకున్నారు. కొన్ని వేల సినిమా పాటలను రచించిన సిరివెన్నెలకు ఈ అవార్డును అందజేయడం అభినందనీయమన్నారు.

మాజీమంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ తమ జిల్లావాసి అయిన నాగభైరవ కోటేశ్వరరావు అవార్డును సిరివెన్నెలకు అందజేయడం ఆయనకు జీవితకాలం గుర్తుండిపోతుందన్నారు.

కాగా, ఈ అవార్డును అందుకున్న సిరివెన్నెల తన మాటల్లో ఎంతో మహోన్నతమైన వ్యక్తి పేరున నెలకొల్పిన ప్రతిష్టాత్మకమైన అవార్డును తనకు అందజేయడం పట్ల ఆనందించారు. కవిత్వం అంటే కాలక్షేపం కాదని, కళా ప్రదర్శన కూడా కాదని, కవిత్వం అంటే జీవితానికి దిశ, దశను నిర్దేశించే దివ్య శక్తి అని, అలాంటి కవిత్వాన్ని ఔపోసన పట్టిన నాగభైరవ కోటేశ్వరరావు లాంటి వ్యక్తిని స్మరించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కవిత్వాన్ని తన జీవన విధానంగా మార్చుకున్న నాగభైరవ కోటేశ్వరరావును భావితరాలకు ఆదర్శంగా కొనియాడారు. నాగభైరవకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది శిష్యులు వున్నా, ఆయన పేరు మీద అవార్డును నెలకొల్పి తన గురువు పేరును చిరస్మరణీయం చేస్తున్న చిన్ని నారాయణరావు, వెన్నెలకంటిలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

సభా కార్యక్రమంలో అతిథులకు చిన్ని నారాయణరావు స్వాగతం పలికారు. కమిటీ సమన్వయకర్త బీరం సుందరరావు తన స్వాగతోపన్యాసంలో అవార్డు కమిటీ లక్ష్యాలను, నాగభైరవ, సిరివెన్నెలల ప్రతిభా పాఠవాలని వివరించారు.



### 'గంపకూడు'కు సిరివెన్నెల ప్రశంస



డాక్టర్ నాగభైరవ అవార్డు స్వీకరణ అనంతరం ఒక వ్యక్తిత్వ వికాస పాఠంలా, ఉత్తుంగ తరంగంలా సాగిన సిరివెన్నెల సీతారామశాస్త్రి ప్రసంగం చివరలో తన ప్రసంగానికి చిన్ని నారాయణరావు కవితా పంక్తులనే స్ఫూర్తిగా తీసుకున్నట్టు చెప్పడం విశేషం. ఈ సందర్భంగా 'గంపకూడు' కవర్ పై ఉన్న కవితా పంక్తులను సీతారామశాస్త్రి ప్రత్యేకించి విశ్లేషించారు. "మనిషి చెట్టుగా మారి వనంలా పుష్పిస్తే ఆ కమనీయ రంగురంగుల సౌందర్యాన్ని ఆరాధించాలని ఉంది.. మనిషిని ప్రేమించే అభిమానించే వ్యక్తి తారసపడితే మానవీయ సామ్రాజ్యానికి పట్టాభిషేకం చేయాలని ఉంది.." అన్న చరణాలను పేర్కొంటూ, ప్రతి సంధ్యా సూర్యుడిని మింగాలని చూసినా సూర్యుడు అగ్నిగోళమై సముద్రం నుండి ప్రతిరోజూ తిరిగి ఉద్భవించి లోకానికి వెలుగు ప్రసాదిస్తాడనీ, చిన్ని నారాయణరావు ఆకాంక్ష కల్ల కాదనీ, కాకూడదనీ, అది తెల్లవారినంత నిజమనీ పేర్కొనడం విశేషం.




సిరివెన్నెలను సత్కరిస్తున్న నాగభైరవ కుటుంబసభ్యులు

# రాజీనామాలు జగన్నాటకమే!



నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి

ఇంకో ఏడాదిలో ఎన్నికలు పెట్టుకుని తన ఎంపీల చేత ఏప్రిల్‌లో రాజీనామాలు చేయిస్తానని వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రకటించడం పెద్ద నాటకమని నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎద్దేవా చేశారు. 14వ తేదీ నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపా ఎంపీలు ఏప్రిల్‌లో రాజీనామా చేసినా ఆమోదించే పరిస్థితి ఉండదని, ఈలోపు ఉపఎన్నికలు కూడా రావని, ఆ ధైర్యంతోనే జగన్ రాజీనామా డ్రామాకు తెరలేపాడని విమర్శించారు. మాట తప్పని, మడమతిప్పని ఈ జగన్ 2016లోనే ఎందుకు తన ఎంపీల చేత రాజీనామా చేయించలేదని ప్రశ్నించారు. జిల్లాలో జగన్ పాదయాత్రకు స్పందన కరువైందని, ఆయన సభలకు జనాన్ని తోలలేక వైసిపి ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు సతమతమయ్యారని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మొయినుద్దీన్, అంచూరు శ్రీనివాసులు, సిద్ధిక్, కుప్పారపు బాలాజీ, జలదంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



## 'ప్రభా'తం

# 'హోదా' రాజకీయం

**ఎన్నో విషయాలను రాజకీయంగా చూడొచ్చు కానీ, అన్ని విషయాలనూ అదేవిధంగా చూడకూడదు. అందులోనూ ప్రజాప్రయోజనాలు ముడిపడివున్న విషయాలను రాజకీయంగా చూడడం ఏనాటికీ మంచిది కాదు. విభజనతో, భారీ ఆర్థికలోటుతో అవస్తలుపడుతున్న ఆంధ్రరాష్ట్రాన్ని అన్నివిధాలా ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. తద్వారా రాష్ట్రాభివృద్ధికి బాటలు వేయాలి. అందుకు అన్నిపార్టీల వారు రాజకీయాలకు అతీతంగా కలసికట్టుగా కృషిచేయాలి.**

రాజకీయాలు పలు రకాలు. అందులోనూ మన రాష్ట్రంలో విభజనానంతరం రకరకాల రాజకీయాలొచ్చాయి. 'విభజన రాజకీయాలు', 'ప్రత్యేకహోదా రాజకీయాలు', 'ప్యాకేజీ రాజకీయాలు' లాంటివి కూడా వచ్చి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తూనే ఉన్నాయి. ఇప్పుడు తాజాగా జరుగుతున్నదదే. 'హోదా' రాజకీయాలతో రాష్ట్రం అట్టుడుకుతోంది.

నిండుగా ఉన్న రాష్ట్రాన్ని రెండుగా చేసి.. అడ్డగోలుగా ముక్కలుచెక్కలు చేసిపారేసి కాంగ్రెస్ ఆ పాపం మూటగట్టుకుంది. అందులోనూ ఆంధ్రకు మరీ అన్యాయం చేసి, రాజధాని సైతం లేకుండా మొండిగానే వదిలేసి వెళ్ళిపోయింది. 'ప్రత్యేక హోదా' అంశం కూడా అప్పుడే తెరమీదకి వచ్చింది. విభజన సందర్భంలో కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వంతో వాదించి మరీ ఒప్పించుకున్న విషయమే 'ప్రత్యేక హోదా'. అప్పుడు రాష్ట్రానికి ప్రత్యేక హోదా అయిదేళ్ళు కాదు, పదేళ్ళుండాలని బిజెపి నాయకుడు వెంకయ్యనాయుడు పట్టుబట్టడం, పదేళ్ళు కాదు పదిహేనేళ్ళుండాలని ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబునాయుడు కోరడం అందరికీ తెలిసిందే. ఆ తర్వాత ఎన్నికలొచ్చాయి. ఎన్‌డిఏ నాయకులైన నరేంద్రమోడీ, చంద్రబాబు నాయుడు ఇద్దరూ కలిసి రాష్ట్రంలో పర్యటిస్తూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చేశారు. ఆ తర్వాత, అధికారంలోకి వచ్చాక ఇద్దరూ మాట మార్చారు. దీంతో మళ్ళీ గందరగోళం ప్రారంభమైంది. ప్రత్యేకహోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని కేంద్రం చెప్పడం, అందుకు ముఖ్యమంత్రి సరేనంటూ సమ్మతించడం జరిగిపోయాయి. ప్రత్యేక హోదా వల్ల ఒరిగేదేమీ లేదని, అదేమీ సంజీవని కాదని, ప్రత్యేకహోదా కంటే ప్రత్యేక ప్యాకేజీతో నిధులు వరదలై వస్తాయని ముఖ్యమంత్రి అప్పట్లో సర్దిచెప్పుకున్నారు. ఆ తర్వాత కొంతమేరకు నిధులు కూడా వచ్చాయి. అలా రెండు మూడేళ్ళు జరిగిపోయాయి. నాలుగు బడ్జెట్‌లు జరిగిపోయి రాష్ట్రానికి రావాల్సిన నిధులు అరకొరగానే రావడంతో, విభజన చట్టంలో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో నెరవేరకపోవడంతో మిత్రపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీ ఇరకాటంలో పడింది. ఇప్పుడు మళ్ళీ ఎన్నికలు దగ్గరకు వస్తున్న నేపథ్యంలో, మళ్ళీ ఈ అంశమే తెరమీదకి వస్తోంది. విభజనతో నష్టపోయిన రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏమిచ్చారంటూ తెలుగుదేశం నేతలు ఇప్పుడు స్వరం పెంచారు. అదేస్థాయిలో పార్లమెంట్ ఉభయసభల్లోనూ రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఆందోళనను ఉధృతం చేశారు. ఆ అడిగేదేదో తొలినుంచి అడిగివుంటే ఇప్పుడు పరిస్థితి ఇలా ఉండేది కాదేమో!... అప్పుడేమో అన్నిటికీ తలూపి, ఇప్పుడు నిధులు రావడం లేదనడం ఏమిటని ప్రతిపక్షం విమర్శ. అయితే, ఈ విషయంలో సాధ్యమైనంత ఉత్తమ పరిష్కారం కనుగొనేందుకు ప్రయత్నిస్తామని, ఆంధ్రప్రదేశ్‌లోని మా మిత్రులకు సంతృప్తినిచ్చేలా సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటామని, ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల తాము పూర్తి సానుభూతితో ఉన్నామని, వారి సమస్యలన్నీ సానుభూతితో పరిశీలిస్తామని కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ అంటున్నారు. అయినా, ఏళ్ళు జరుగుతున్నా విభజన హామీలను పూర్తిస్థాయిలో తీర్చకపోవడమేమిటని, మాటలతోనే కాలయాపన జరిగిపోతోందని రాష్ట్రనాయకుల ఆవేదన. ఎన్నికల సమయంలో ప్రకటించినట్లుగా ఆ హోదా హామీని కేంద్రం నెరవేర్చివుంటే ఇప్పుడీ పితలాటకమంతా ఉండేది కాదు. రాష్ట్రానికి హోదా బదులు ప్యాకేజీ ఇస్తామని చెప్పినప్పుడైనా, ఆ నిధులేదో పూర్తిస్థాయిలో ఇచ్చి ఉంటే ఇప్పుడింత ఆందోళన ఉండేది కాదు. చివరికి అదీ లేదు..ఇదీ లేదు అన్నట్లుంది ఇప్పుడు రాష్ట్ర పరిస్థితి. నాయకులకు ఆగ్రహం వచ్చినప్పుడొకసారి, అనుగ్రహం కలిగినప్పుడొకసారి రకరకాలుగా మాటలు మారుతుండడం విచారకరం. నాలుగేళ్ళు గడిచిపోయాయి. కాకి అరుస్తూనే ఉంటుంది.. కరవాడ ఎండుతూనే ఉంటుందన్న సామెతగా వుంది ఇప్పటి పరిస్థితి. మళ్ళీ సార్వత్రిక ఎన్నికలు కూడా రానున్నాయి. ప్రతిపక్ష నాయకుడైన జగన్ మాత్రం 'ప్రత్యేకహోదా'తోనే రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుందని తొలినుంచి స్పష్టం చేస్తూనే ఉండడమే కాక, రాష్ట్రానికి ఇస్తామన్న ఆ ప్రత్యేక హోదా ఏప్రిల్ 6వ తేది నాటికైనా ఇవ్వకుంటే తమ పార్టీ ఎంపీలతో రాజీనామాలు చేయిస్తామని కూడా ప్రకటించి కలకలం సృష్టిస్తున్నారు. నిధుల కోసం పోరాడాలంటూ తమ ఎంపీలకు టిడిపి నేతలు మరో వైపు గట్టిగా చెప్తున్నారు. ఇలా ప్రత్యేకహోదా ప్రస్తావన కొచ్చినప్పుడల్లా రాజకీయవర్గాల్లో రకరకాల వాద వివాదాలు, ఆందోళనలు బయలుదేరుతూనే ఉండడం అందరం చూస్తూ ఉన్నదే. హోదా కోసం పోరాడాలని కొందరు... వద్దనేవారు కొందరు. ఇవి కూడా గతంలో జరిగినవే. అప్పుడొక మాట... ఇప్పుడొక మాట. ఇవన్నీ రాజకీయా ల్లోని భాగాలే. అప్పుడప్పుడూ 'హోదా.. హోదా' అంటూ అరవడమే తప్ప మనం సాధించుకున్నదేమీ లేదు. వీటినే 'కాలయాపన రాజకీయాలు' అంటారు. చిత్త శుద్ధి లేని రాజకీయాలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదు. అయితే, ఇక్కడొక విషయం స్పష్టంగా చెప్పుకోవాలి. ఎన్నో విషయాలను రాజకీయంగా చూడొచ్చు కానీ, అన్ని విషయాలనూ అదేవిధంగా చూడకూడదు. అందులోనూ ప్రజాప్రయోజనాలు ముడిపడివున్న ఇలాంటి విషయాలను రాజకీయంగా చూడడం ఏనాటికీ మంచిది కాదు. రాజకీయాలను పక్కనపెట్టి అందరూ కలసికట్టుగా సాధించుకుంటే రాష్ట్రాభ్యున్నతి పెద్ద కష్టమేమీ కాదు. ఇదేమీ పార్టీల సమస్య కాదు..బీజెపి-టీడీపిల సమస్య అసలే కాదు. రాష్ట్ర ప్రజల సమస్య. అది 'హోదా' అయినా, నిధులైనా ఇవ్వాల్సింది కేంద్రమే. అందులోనూ విభజనతో, భారీ ఆర్థికలోటుతో అవస్తలుపడుతున్న రాష్ట్రాన్ని అన్నివిధాలా ఆదుకోవాల్సిన బాధ్యత కూడా కేంద్రానిదే. ఆ బాధ్యతను కేంద్రం విస్మరిస్తుందని అనుకోలేం. దేశంలోని అన్ని రాష్ట్రాలూ సమగ్రంగా అభివృద్ధి చెందినప్పుడే దేశసమగ్రాభివృద్ధి అనేది విజ్ఞులకు తెలియనిది కాదు. కేంద్రం.. రాష్ట్రాభ్యున్నతికి అవసరమైన ఆర్థికసాయాన్ని పూర్తిస్థాయిలో అందజేసి రాష్ట్రం తిరిగి అభివృద్ధిపథంలో సాగేందుకు తగు చేయూతనివ్వాలన్నదే రాష్ట్ర ప్రజల ఆకాంక్ష. అందుకు అన్ని పార్టీలూ, రాజకీయాలకు అతీతంగా.. రాష్ట్రాభ్యున్నతే లక్ష్యంగా.. కలసి కృషిచేయడమే సరైన మార్గం!....

## విద్వాన్ కిరణశ్రీకి సన్మానం



కిరణశ్రీని సత్కరిస్తున్న ఓవన్‌డి పెంచలరెడ్డి, విసి వీరయ్య తదితరులు

నెల్లూరులోని డాక్టర్ విజయ్‌కుమార్ మెమోరియల్ నెల్లూరు హాస్పిటల్ మీటింగ్‌హాల్లో ఇటీవల నెల్లూరు సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో విద్వాన్ బూతపాటి కిరణశ్రీకి ఘనసన్మానం జరిగింది. 2017 సంవత్సరంలో ఆంధ్రప్రభుత్వ మైనారిటీ శాఖ ఉత్తమ కవిగా పురస్కారాన్ని అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా నెరసం అధ్యక్షులు ఎ.జయప్రకాష్ వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా ఓవన్‌డి పెంచలరెడ్డి పాల్గొన్నారు. అవ్వారు శ్రీధర్‌బాబు సభానిర్వహణ గావించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ కిరణశ్రీ తెలుగు ఉభయరాష్ట్రాల్లో ఉత్తమ కవిగానే కాకుండా ఆంగ్లం నుండి తెలుగులో తర్జుమా చేయగలిగిన ఏకైక వ్యక్తి అని ప్రశంసించారు. గుఱ్ఱం జాషువా విగ్రహ ప్రతిష్టకు ఎంతో ప్రయత్నించి సాధించారని కొనియాడారు. ఓవన్‌డి పెంచలరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రపతి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు అవార్డులు అందుకున్న ప్రముఖులు కిరణశ్రీ అని ప్రశంసించారు. విఎస్‌యు వైస్‌ఛాన్సలర్ వి.వీరయ్య మాట్లాడుతూ గుఱ్ఱం జాషువా పేరుతో గ్రంథాలయం ఏర్పాటు చేయాలనేది కిరణశ్రీకి ఉన్న మరో ఆశయం అన్నారు. సన్మానగ్రహీత కిరణశ్రీ మాట్లాడుతూ 1995 నుంచి 2014 వరకు ఉన్నత పాఠశాలలకు తెలుగు వాచక రచయితగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెరసం ఉపాధ్యక్షుడు మాటేటి రత్నప్రసాద్, పెరసం ప్రధాన కార్యదర్శి గుండాల నరేంద్రబాబు, కిరణశ్రీ శిష్యులు పాల్గొన్నారు.

## పెన్నా సాహిత్య పురస్కారానికి ఆహ్వానం

పెన్నా రచయితల సంఘం నెల్లూరుజిల్లా వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి "పెన్నా సాహిత్య పురస్కారం-2017"ను ప్రదానం చేయనున్నట్లు పెరసం అధ్యక్షకార్యదర్శులు అవ్వారు శ్రీధర్‌బాబు, గుండాల నరేంద్రబాబు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కవులు 2016, 17 సంవత్సరాలలో ప్రచురితమైన కవితా సంపుటాలను మార్చి నెల 15వ తేదీలోగా 4 ప్రతులను గుండాల నరేంద్రబాబు, ప్రధానకార్యదర్శి, 25-1-890, నేతాజీనగర్, 3వ వీధి, ఎ.కె.నగర్ పోస్టు, నెల్లూరు-4 చిరునామాకు పంపుకోవాలని కోరారు. ఎంపికైన ఉత్తమ కవితా సంపుటికి రూ.3వేలు నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరిస్తామన్నారు. ఇతర వివరాలకు 9493235992 నెంబరులో సంప్రదించాలని కోరారు.

## ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు

నెల్లూరు సంతపేటలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయ హుండీని ఈ నెల 9న లెక్కించారు. గత నవంబరు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 9వతేది వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా 91,916 రూపాయలు వచ్చినట్లు ఆలయవర్గాలు పేర్కొన్నాయి. ఈ లెక్కింపును ఆలయ ఛైర్మెన్ గిరి, సభ్యులు రేవతి, సిద్దయ్య, రఘుపతి, అచ్యుత రావుతో పాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్‌కె చైతన్య పర్యవేక్షించారు.




## కాంగ్రెస్‌కు పట్టిన గతే!

రాజకీయాలలో ఎవరైనా పతనమయ్యేది అహంకారంతోనే! ప్రధాని నరేంద్రమోడీలో అహంకారపూరిత ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. ప్రతిపక్షాలకు కనీస గౌరవం ఇవ్వకుండా మాట్లాడుతున్నారు. పార్లమెంటు లోనూ బయట ఆయన చేసే ప్రసంగాలు ఒక దేశ ప్రధాని చేస్తున్న ప్రసంగాలు మాదిరిగా లేవు. ఒక చోటా రాజకీయ నాయకుడు చేసే ప్రసంగాల్లా వుంటున్నాయి. ఎంతసేపు గతంలో కాంగ్రెస్ చేసిన తప్పులను ఎత్తి చూపడం తప్పితే, దేశానికి తాము ఏం చేసాం, ఏం చేయాలనుకుంటున్నాం అన్నదానిపై ఆయనకే స్పష్టతలేదు.

సంగిడి కొండారెడ్డి, డి.సి.పల్లి.

## వాళ్ళకొక న్యాయం... వీళ్లకొక న్యాయమా?

బీజేపీ క్రమశిక్షణ గల పార్టీ అని పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించదని ఆ పార్టీ నాయకులు డప్పుకొట్టుకుంటుంటారు. మరి ఆంధ్రప్రదేశ్‌లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నుండి గెలిచిన ముగ్గురు ఎంపీలు తెలుగుదేశంలోకి దూరారు. వీళ్ళ మీద చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసిపి నేతలు లోక్‌సభ స్పీకర్‌కు విన్నవించి వున్నారు. దళ్(యు) పార్టీ అధిష్టానాన్ని ధిక్కరించారని చెప్పి రాజ్య సభలో ఆ పార్టీకి చెందిన ఇద్దరు రాజ్యసభ సభ్యులపై అనర్హత వేటు వేశారు. మరి అదే న్యాయం లోక్‌సభలో ఏమైంది. ముగ్గురు ఎంపీలు పక్కాగా తప్పుచేసారని తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. బీజేపీది ద్వంద్వ నీతి అని అర్థమవుతోంది.

పోకల సుదర్శన్, నరుకూరు.

## రాష్ట్రాన్ని ముంచింది చంద్రబాబే!

ఆంధ్రప్రదేశ్‌ను ముంచింది చంద్రబాబునాయుడు... ఆయన రెండు కళ్ళ సిద్ధాంతమే! చంద్రబాబు లేఖ ఇవ్వడం వల్లే రాష్ట్ర విభజనకు పూనుకున్నామని నాటి యూపిఏ ప్రభుత్వ అధినేత సోనియాగాంధీ చెప్పడం తెలిసిందే! విభజన తర్వాత చంద్రబాబు రెండుకళ్ళ సిద్ధాంతాన్ని అనుసరించారు. హైదరాబాద్ నుండి పరిశ్రమలను తెచ్చి ఏపిలో పెడతామన్న పారిశ్రామికవేత్తలను అలా చేయొద్దని వారించాడు. ఆంధ్ర డబ్బుతో హైదరాబాద్‌లో బిల్డింగ్‌లకు సోకులు చేశాడు. ఈరోజు ఆ బిల్డింగ్‌లను వదులుకున్నాం, సినీ పరిశ్రమను అక్కడే వదిలేసాడు. ఊహల రాజధాని పేరుతో కేంద్రం నుండి వచ్చిన నిధులన్నింటిని వృథా చేసాడు. ఆయన నిర్వాకం మూలంగా ఏపికి చాలా నష్టమే జరిగింది.

సి. కృష్ణమూర్తి, నెల్లూరు.

## తెరపైకి..
# మళ్ళీ రామాయపట్నం!




విభజన హామీలు అమలు చేయాలంటూ రాష్ట్రంలో ఆందోళనలు తీవ్రతరమవుతున్న తరుణంలో రామాయపట్నం పోర్టు అంశం మళ్ళీ తెరమీదకొచ్చింది. విభజన హామీలలో నెల్లూరు జిల్లా వాకాడు మండలంలోని దుగరాజపట్నం పోర్టు ఒకటి. యూపిఏ ప్రభుత్వం చివరి ఘడియల్లో ఈ పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయించాలని అప్పటి తిరుపతి ఎంపీ చింతా మోహన్ తీవ్రంగా ప్రయత్నించాడు. అది సాధ్యం కాలేదు. ఆ తర్వాత రక్షణ పరంగా 'ఇస్రో' అభ్యంతరాలు, పులికాట్ సరస్సు పర్యావరణానికి ముప్పు రావచ్చనే నివేదికలతో ఈ పోర్టు నిర్మాణంపై అనుమానాలు కమ్ముకున్నాయి. ఒక దశలో భూసేకరణ ప్రక్రియ మొదలుపెట్టి కూడా నిలిపేసారు.

మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీలను నెరవేర్చలేదన్న అంశం రగులుకొంది. వీటిలో దుగరాజపట్నం పోర్టు కూడా వుంది. అయితే దుగరాజపట్నం వద్ద పోర్టు నిర్మాణంపై అభ్యంతరాలున్నాయని, ప్రత్యామ్నాయ పోర్టును పరిశీలిస్తున్నామని కేంద్ర మంత్రి చెప్పడంతో ఇప్పుడు రామాయపట్నం మళ్ళీ చర్చల్లోకి వచ్చింది. ప్రకాశం, నెల్లూరుజిల్లాల సరిహద్దులో వున్న రామాయపట్నం వద్ద పోర్టు నిర్మించాలని కావలి ప్రాంత నాయకులు, అలాగే, ఒంగోలు ఎంపి వై.వి.సుబ్బారెడ్డి గతంలోనూ ఆందోళనలు చేసి వున్నారు. కావలి నుండి రామాయపట్నం వరకు పాదయాత్రలు కూడా చేశారు. అప్పటి కేంద్రమంత్రి, ఇప్పటి ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు దృష్టికి కూడా రామాయపట్నం అంశాన్ని తీసుకెళ్లారు. దుగరాజపట్నం పోర్టుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని కేంద్రమే ప్రకటించిన నేపథ్యంలో ఇప్పుడు రామాయపట్నంపై ఆశలు మొలకెత్తుతున్నాయి.

రామాయపట్నం పోర్టు వస్తే జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన కావలి ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో పారిశ్రామికాభివృద్ధి అంతా కూడా నెల్లూరుకు దక్షిణం వైపునే కేంద్రీకృతమైంది. నెల్లూరుకు ఉత్తరాన ఇఫ్కో సెజ్ పెట్టినా అది సక్సెస్ కాలేదు. ఇప్పుడిప్పుడే అక్కడి సెజ్‌లో పరిశ్రమలు వస్తున్నాయి. ఇక దగదర్తి వద్ద ఎయిర్‌పోర్టు మంజూరు కావడం తెలిసిందే! దీనికి తగ్గట్లుగా రామాయపట్నం పోర్టు కూడా వస్తే నెల్లూరు – కావలిల మధ్య వడివడిగా అభివృద్ధి అడుగులు పడతాయని ఈ ప్రాంతవాసుల ఆశ!



## కేడర్‌ని...
# కదనరంగంవైపు నడిపిస్తున్న జగన్

*నాయకుడంటే ఓ నమ్మకం... నాయకుడంటే ఓ భరోసా... నాయకుడంటే ఓ ధైర్యం. తన పార్టీలో లీడర్లకు, తన పార్టీ కేడర్‌కు అలాంటి నమ్మకాన్ని, అలాంటి ధైర్యాన్ని కల్పించడంలో విజయం సాధించాడు వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి!*


ఎమ్మెల్యే అనిల్, ప్రసన్నకుమార్‌రెడ్డిలతో...


రేపటిపౌరులతో అడుగులు వేస్తూ...


విజయసాయిరెడ్డితో చర్చిస్తూ...

నెల్లూరుజిల్లాలో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర కనీవిని ఎరుగని రీతిలో విజయవంతమైంది. జనవరి 23వ తేదీన పెళ్ళకూరు మండలం పెనబాక వద్ద మొదలైన జగన్ ప్రజాసంకల్ప పాదయాత్ర ఈ నెల 16వ తేదీన కొండాపురం మండలం వద్ద ముగిసి, ప్రకాశం జిల్లాలోకి ప్రవేశించింది. జిల్లాలో దాదాపు 20రోజుల పాటు ఆయన పాదయాత్ర(శుక్రవారాలు, బంద్ రోజు తీసేస్తే) సాగింది. సూళ్లూరుపేట, గూడూరు, సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కోవూరు, ఆత్మకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాలను కవర్ చేస్తూ సాగిన ఈ యాత్రలో ప్రతి నియోజకవర్గానికీ ఒక చోట బహిరంగసభ నిర్వహించారు. జనం బహిరంగసభలకు గాని, పాదయాత్రలకు గాని పోటెత్తినట్లు వచ్చారు. జగన్ తిరిగిన చోటల్లా ప్రజల నుండి మంచి స్పందన వచ్చింది. మహిళలు, వృద్ధులు, యువత ఎక్కువగా ఆయన పాదయాత్రలో కనిపించారు. జగన్ పాదయాత్రకు తరలించిన జనం కంటే తరలి వచ్చిన జనమే ఎక్కువగా వుండడం ఆయన పట్ల వున్న ప్రజాభిమానానికి నిదర్శనం.

ఇక రాజకీయ కోణంలో ఆలోచిస్తే జిల్లాలో వైసిపి లీడర్లకు గాని, వైసిపి కేడర్‌కు గాని జగన్ పాదయాత్ర ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. వచ్చే ఎన్నికలకు కార్యోన్ముఖులను చేసింది. గట్టిగా పోరాడితే విజయం మనదేనన్న ధీమాను కల్పించింది. వరుస వలసలు, ఎల్లో మీడియా దుష్ప్రచారంతో కొంచెం అటు ఇటుగా వున్న కేడర్‌లో కూడా జగన్ పాదయాత్ర ఒక నమ్మకాన్ని కలిగించింది. అధికార పార్టీ వైపు చూస్తున్న కొందరు నాయకుల మనసు మార్చుకునేలా చేసింది. జగన్ పాదయాత్రతో జిల్లా వైసిపికి ఎంతో ఊపు వచ్చిందని మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు.

# ఆర్యవైశ్యుల మధ్య చిచ్చు


విలేకర్లతో మాట్లాడుతున్న వైయస్సార్సీపీ వర్గ ఆర్యవైశ్య నాయకులు


విలేకర్లతో మాట్లాడుతున్న తెదేపా వర్గ ఆర్యవైశ్య నాయకులు

రాష్ట్ర రాజకీయాలలో ఎన్ని వర్గాలుంటాయో నెల్లూరు నగరంలోని ఆర్యవైశ్యులలో అన్ని వర్గాలుంటాయి. వీరిలో వీరికి వర్గ రాజకీయాలు ఎక్కువే! వీళ్లకు వీళ్లే వెన్నుపోట్లు పొడుచుకుంటుంటారు. ఒకడు సొంతంగా ఎదుగుతున్నాడంటే ఇంకొందరు కాళ్ళు పట్టి కిందకు లాగుతుంటారు.

నెల్లూరుజిల్లాలో ఒక ఆర్యవైశ్య యువకుడు ముఖ్యమంత్రి చంద్రబాబును అభ్యంతరకర భాషతో తిట్టిన సంఘటన నగరంలో ఆర్యవైశ్యుల మధ్య గొడవలకు బీజం వేసింది. ఈ నెల 4వతేదీన నెల్లూరురూరల్ నరసింహకొండ వద్ద జరిగిన ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంకు వైకాపా అధినేత జగన్ హాజరు కావడం తెలిసిందే! ఆ సమావేశంలో అమరా సునీల్ అనే ఆర్యవైశ్య యువకుడు తన ఋణం మాఫీ కాలేదంటూ చంద్రబాబును అభ్యంతరకర పదాలతో తిట్టాడు. అక్కడే జగన్ కూడా అలా మాట్లాడకూడదంటూ అతనిని వారించాడు. న్యూస్ ఛానెల్స్‌లో దీనిని చూసిన నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సీఎంను తిట్టిన అమరా సునీల్ మీద, ప్రోత్సహించిన వైసిపి నాయకుల మీద చర్యలు తీసుకోవాలంటూ నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇక్కడే మీడియాతో కొందరు రౌడీలు చేరి మీటింగ్ పెట్టి సీఎంను తిట్టించారని ఆరోపించారు. తర్వాత నెల్లూరు రూరల్ పోలీసులు అమరా సునీల్‌ను అరెస్ట్ చేయడం బెయిల్‌పై బయటకు రావడం జరిగింది.

కాగా, ఆర్యవైశ్యులను రౌడీలుగా చిత్రిస్తూ నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడిన తీరు ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీసిందని, ఒకరు తప్పు చేస్తే మొత్తం ఆర్యవైశ్యుల మీదే రౌడీలని ముద్ర వేస్తారా? అంటూ మొన్న డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ప్రెస్‌మీట్ పెట్టి విరుచుకుపడ్డాడు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని టార్గెట్ చేస్తూ ఆయన విమర్శలు చేశాడు. దీనికి కౌంటర్‌గా 12వ తేదీ ద్వారకా వైరివర్గం ఆర్యవైశ్య నాయకులు ప్రెస్‌మీట్ పెట్టారు. ఇదంతా టీడీపీ బ్యాచ్. ఆర్యవైశ్యులను ద్వారకా తప్పుదోవ పట్టిస్తున్నాడంటూ, ఆయన ఆర్యవైశ్యులకు చేసిందేమీ లేదంటూ ఆరోపణలు చేశారు.

మొత్తానికి నగర ఆర్యవైశ్యుల మధ్య మన పొలిటీషియన్స్ చిచ్చుపెట్టారు. ఎన్నికలదాకా కూడా ఆ చిచ్చు ఆర్పకుండా కాపాడుకుంటూనే వుంటారు.

# అజీజా... నిన్నొదలా...!



## ➤ వెంటాడుతున్న వివాదాలు

*నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ వివాదాలతో సహజీవనం చేస్తున్నట్లుగా వుంది అది వ్యాపారంలోనైనా... ఇటు రాజకీయాలలోనైనా! అజీజ్ మేయర్ అయ్యింది మొదలు నెల్లూరు కార్పొరేషన్‌లో ఎన్నో వివాదాలు చూసాం. ఏ కమిషనర్‌తోనూ ఆయనకు పడేది కాదు. ఇలా పడకనే గత నాలుగేళ్ల కాలంలో 9మంది కమిషనర్లు మారారు. ఇక సొంత పార్టీ కార్పొరేటర్లతోనూ వివాదాలే. అధికార పార్టీ నాయకులందరితోనూ విభేదాలే!*

ఇంతకాలం రాజకీయ వివాదాలే తెరకెక్కుతూ వచ్చాయి. ఇప్పుడు వ్యాపార పరమైన వివాదాలు కూడా ఆయనను చుట్టుముడుతున్నాయి. ఇటీవల చెన్నైకు చెందిన ప్రసాద్ జెంపెక్స్ అనే కంపెనీ అజీజ్‌పైన, ఆయన కుటుంబసభ్యులపైన కేసు పెట్టడం తెలిసిందే! స్టార్ ఆగ్రోకు తామిచ్చిన 42కోట్ల రూపాయలను తమ వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్ళించుకున్నారంటూ జెంపెక్స్ కంపెనీ చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు కావడం, ఈ సంఘటన జిల్లాలో అలజడి రేపడం తెలిసిందే! తాజాగా యూనియన్ బ్యాంక్ ఇండియా వాళ్లు కూడా స్టార్ ఆగ్రోపై ఫిర్యాదు చేశారు. స్టార్ ఆగ్రోకు అజీజ్‌కు సంబంధం లేదంటూ వాళ్ళ తమ్ముడు, కార్పొరేటర్ జలీల్ మీడియా ముందుకొచ్చాడు. మరి యూనియన్ బ్యాంకు వాళ్ళయినా, జింపెక్స్ కంపెనీ వాళ్లయినా డబ్బులు కట్టింది, లోన్‌లు ఇచ్చింది అజీజ్‌తో జరిపిన లావాదేవీలవల్లనా? లేక ఆయనకు సంబంధం లేకుండానే ఇన్నేసి కోట్లు లోన్లు ఇచ్చారా? ఎవరు అబద్ధం చెబుతున్నట్లు? ఎవరు నిజాయితీగా వున్నట్లు? త్వరలో తేలకుండాపోతుందా?

# నెల్లూరు కబుర్లు

## ఎన్నాళ్ళకెన్నాళ్ళకు...

### • పారిశుద్ధ్యం మెరుగవుతోంది



నెల్లూరు నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. మున్సిపల్ మంత్రి పి.నారాయణ నెల్లూరులో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో కొంత ఫలితం కనిపిస్తోంది. ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు బాగానే జరుగుతున్నాయి. మినీబైపాస్‌లోని కొన్ని ప్రాంతాల్లో చెత్తదిబ్బలు పేరుకుపోయి వున్నాయి. అట్లాంటి చోట్ల నీట్‌గా చేశారు. ముఖ్యమైన ప్రాంతాల్లో తడి చెత్త, పొడి చెత్తకు ప్రత్యేకంగా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా కాలనీలలోనూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా గృహస్థులు, అపార్ట్‌మెంట్‌ల నుండి పారిశుద్ధ్య సిబ్బందే తోపుడుబండ్ల ద్వారా చెత్తను సేకరిస్తున్నారు. చెత్త నగరంగా పేరున్న నెల్లూరు నగరంలో ఇప్పుడిప్పుడే పారిశుద్ధ్యం బాగుపడుతోంది.

## కపాడిపాలెంలో మంత్రి బస



'దళిత తేజం' కార్యక్రమంలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి పి.నారాయణ

'దళిత తేజం–తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ మంత్రి పి.నారాయణ 11వ తేదీ నెల్లూరు నగరంలోని కపాడిపాలెంలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి దళితుల సంక్షేమం కోసం తెలుగుదేశం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. మంత్రి అక్కడే దళితులతో కలిసి భోంచేసి, వారి మధ్యే నిద్రపోయారు. ఆయన వెంట నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కార్పొరేషన్ విప్ డాక్టర్ జడ్.శివప్రసాద్‌లు కూడా వున్నారు.

## బిజిఆర్ ఉమెన్స్ అకాడమీ వీడ్కోలు వేడుక



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న కరస్పాండెంట్ జె.వి.రెడ్డి

నెల్లూరులోని బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 10న డిగ్రీ ఫైనలియర్ విద్యార్థినులకు ఫేర్‌వెల్ పార్టీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు ఇస్కాన్ మందిర అధ్యక్షులు డాక్టర్ సుకదేవస్వామి పాల్గొని అమూల్య సందేశానిచ్చారు. కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ జె.వి.రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థినులకు చదువుతో పాటు నైతిక విలువలు బోధిస్తూ వారిని ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మృదుల, పూర్వపు ప్రిన్సిపల్ సన్నపురెడ్డి రాఘవరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



## ఢిల్లీరావు ఐఏఎస్



మొన్నటివరకు నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్‌గా వుండి తన పనితీరుతో అభిమానపాత్రుడై, ప్రస్తుతం నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్‌ఛైర్మెన్‌గా వున్న ఢిల్లీరావుకు ఐఏఎస్ హోదా లభించింది. ఈమేరకు కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఢిల్లీరావు 2007లో గ్రూప్స్‌కు సెలక్టయ్యారు. విజయనగరంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. ఆ తర్వాత విజయనగరం, గుంటూరులలో ఆర్డీఓగా పనిచేశారు. అనంతపురం, గుంటూరులలో డ్వామా ప్రాజెక్ట్ డైరక్టర్‌గా పని చేశారు. విజయనగరం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా రెండేళ్ళు పని చేశారు. 2017లో నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్‌గా వచ్చారు. రాజకీయ ఒత్తిళ్ళ కారణంగా ఇటీవలే 'నుడా' వైస్‌ఛైర్మెన్‌గా బదిలీ అయ్యారు. నెల్లూరులో పని చేస్తుండగానే ఆయనకు ఐఏఎస్ హోదా వచ్చింది. ఆయన సతీమణి ప్రశాంతి తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా పని చేస్తున్నారు. త్వరలో ఆమెకు కూడా ఐఏఎస్ హోదా రానుంది.

## కార్పొరేషన్ అకౌంటెంట్‌గా హిదయతుల్లా

నెల్లూరు కార్పొరేషన్ అకౌంటెంట్‌గా హిదయతుల్లాను నియమించారు. హౌస్‌ఫర్ ఆల్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఈయనను కార్పొరేషన్‌కు బదిలీ చేసి, ఇక్కడ అకౌంటెంట్‌గా వున్న విశ్వంను హౌస్ ఫర్ ఆల్‌కు బదిలీ చేశారు.

## నెల్లూరు బోట్ క్లబ్‌కు "జెట్స్కీ" బోట్లు

ఏపి టూరిజం ఆధ్వర్యంలో నెల్లూరు స్వర్ణాల చెరువులో కొనసాగుతున్న బోట్ క్లబ్‌కు "జెట్స్కీ" బోట్లు ఈ నెల 12న వచ్చినట్లు ఏపి టూరిజం, బోటింగ్ యూనిట్ మేనేజర్ కొప్పోలు అమర్‌నాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణాల చెరువులో ఈ బోటు నడిపేందుకు అన్ని రకాల సాంకేతిక అనుమతులు పొందామని, ఈ జెట్స్కీ బోటులో ఓ డ్రైవరు, ఓ ప్యాసింజర్ ఉంటే అత్యంత వేగంగా నీటిపై ప్రయాణం చేయవచ్చున్నారు. ఏపి టూరిజం శాఖ తన పరిధిని విస్తరింపజేయడంలో భాగంగా నెల్లూరు క్లబ్‌కు ఈ బోట్లు తెచ్చామని, ఈ అవకాశాన్ని నెల్లూరుప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ముసవ్వీర్ మరో అద్భుత సృష్టి



### 108 సూక్ష్మ శివలింగాలతో శివలింగాకృతి



నెల్లూరు జెండా వీధికి చెందిన స్వర్ణకారుడు డాక్టర్ షేక్ ముసవ్వీర్ గతంలో వెండి, స్వర్ణంతో అనేక సూక్ష్మరూపాలను తయారు చేసి అందరి మన్ననలు ప్రశంసలు అందుకున్న విషయం విధితమే. ఈసారి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 7 గ్రాముల 600మి.గ్రాల వెండితో 108 శివలింగాలను తయారుచేసి వాటికి బంగారు పూతతో శివలింగాకృతిలో అమర్చి అందరిని అబ్బుర పరిచారు. ఈ సందర్భంగా షేక్ ముసవ్వీర్ నెల్లూరు ప్రజలకు మహాశివరాత్రిని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. దీనిని తయారు చేయడానికి 8రోజుల సమయం పట్టిందని, ఎత్తు, వెడల్పు 0.5 సె.మీ ఉందని తెలిపారు.

## దివ్యాంగులకు ట్రైసైకిళ్ళు



దివ్యాంగులకు ట్రైసైకిళ్ళను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి, వైసిపి మహిళా అధ్యక్షురాలు గౌరి

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ నెల 11న నెల్లూరు పార్లమెంటరీ వైసిపి మహిళా అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి ఆధ్వర్యంలో 5మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్ళు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రభుత్వ సహకారంతో, స్వర్ణభారత్ ట్రస్ట్, జిల్లా పరిషత్, దాతలు, స్నేహితుల సహాయసహకారాలతో ఇప్పటివరకు దాదాపు 600మందికిపైగా వికలాంగ సోదరులకు ట్రైసైకిళ్ళు, హ్యాండ్ స్టిక్‌లు తదితర పరికరాలు అందించడం జరిగిందన్నారు. ఆపదలో ఉన్నవారికి, అనాధలకి మనం అండగా నిలిస్తే, భగవంతుడు మన కుటుంబాలకు అండగా నిలుస్తాడన్నారు. తనకు అత్యంత తృప్తినిచ్చేది సామాజిక సేవా కార్యక్రమాలన్నారు. కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి, డాక్టర్ సత్తార్, వైయస్సార్సీపీ జిల్లా మహిళా కార్యదర్శి ఎస్‌డి హురియా, కారుదుంప దశరథరామయ్య, రామ్‌మోహన్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిన రిటైర్డ్ ఏడిఎం అండ్ హెచ్‌ఓ



మంత్రి సోమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రల సమక్షంలో తెదేపాలో చేరిన నిమ్మల దశరథరామయ్య

గతంలో జిల్లా అదనపు వైద్యఆరోగ్యశాఖాధికారిగాను, వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులగాను పనిచేసి రిటైర్డ్ అయిన నిమ్మల దశరథరామయ్య తెలుగుదేశం పార్టీలో చేరారు. 11వ తేదీ నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్రల సమక్షంలో ఆయన తన ఊరు బుచ్చికి చెందిన కొంతమంది అనుచరులతో తెలుగుదేశం కండువాలు కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి టీడీపీ ఇన్‌ఛార్జ్ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి కూడా పాల్గొన్నారు.

## రెయిన్‌బోలో ఫామ్‌యార్డ్ పార్టీ



నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని రెయిన్‌బో పాఠశాలలో కిండర్ గార్డెన్ పిల్లలకు పాడి పశువుల గురించి తెలియజేసేందుకు ఇటీవల ఫామ్‌యార్డు పార్టీని ఏర్పాటు చేశారు. పాడిపశువులు అంటే ఏమిటి, వాటి జీవన విధానం, ఆహారపు అలవాట్లు, వాటివల్ల ఉపయోగాలు, అవి మనకు చేసే మేలు తదితర అంశాలను గురించి పిల్లలకు ప్రత్యేకంగా తెలియజేశారు. మేక, కోడి, కుందేలు, గొర్రె, ఆవు, గేదె మొదలగు జంతువులను చిన్నారులకు చూపించారు. ఇటువంటి విజ్ఞానం, వినోదం కలిగించే కార్యక్రమాలు నిర్వహించడంలో రెయిన్‌బో పాఠశాల ముందుంటుందని పాఠశాల డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో కిండర్‌గార్డెన్ టీమ్ లీడర్ ఫాతిమాఖాన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

*స్వచ్ఛసర్వేక్షన్‌లో నెల్లూరును దేశంలోనే 20వ స్థానంలో నిలపాలంటూ మంత్రి నారాయణ, మేయర్ అజీజ్ ఫోటోలతో నగరంలో అక్కడక్కడా ఫ్లెక్సీలు చూస్తున్నాం. నిజమే... స్వచ్ఛసర్వేక్షన్‌లో నెల్లూరును అగ్రగామిగా తీర్చిదిద్దడానికి అందరు కూడా సహకరించాలి. దేశంలో నెల్లూరుకు 20వ స్థానం కాదు, 1వ స్థానం వచ్చినా ఆనందమే! అసలు ఏ స్థానం రాకున్నా నగరం పరిశుభ్రంగా వుంటే ఇంకా ఆనందం. నెల్లూరును పరిశుభ్ర నగరాల జాబితాలో టాప్‌టెన్‌లో నిలపాలంటే ఎంతోకొంత ఖర్చుతో కూడుకున్న పని. అసలు నయాపైసా ఖర్చు లేకుండా చేయగల పని నెల్లూరును ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల రహిత నగరంగా మార్చడం. మున్సిపల్ మంత్రిగా వున్న పి.నారాయణే ముందుగా దీనికి పూనుకోవాలి. ప్లాస్టిక్ బ్యాగులు వాడని తొలి కార్పొరేషన్‌గా నెల్లూరును తయారుచేయాలి. ఆయన తలచుకుంటే ఇది పెద్ద సమస్య కూడా కాదు.*



# ప్లాస్టిక్ రహిత నగరంగా... నెల్లూరును మార్చలేమా?

నేటి మానవసమాజాన్ని ప్లాస్టిక్ సంచులు ఏ విధంగా ఆక్రమించాయో చూస్తూనే వున్నాం. నిద్ర లేచింది మొదలు నిద్రపోయేదాకా మన దైనందిన కార్యకలాపాలలో అవి ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. ఉదయాన్నే ప్లాస్టిక్ పాలప్యాకెట్‌తోనే జీవితం మొదలవుతుంది. ప్లాస్టిక్ కవర్లలో కూరగాయలు, ప్లాస్టిక్ క్యాన్‌లలో నీళ్లు... ప్లాస్టిక్ కవర్‌లు, ప్లాస్టిక్ డబ్బాలలో టిఫిన్, వేడివేడి సాంబార్ పార్శిళ్ళు, ప్లాస్టిక్ బౌల్స్‌లో బిర్యాని పార్శిళ్ళు, ప్లాస్టిక్ కవర్లలో కర్రీస్ పార్సిల్... ఇలా ఒకటేమిటి... ప్రతి చోటా మనకు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిత్యావసర వస్తువులుగా మారాయి.

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులతో వచ్చే అనర్థాల గురించి ప్రతి రోజూ వైద్యులు చెబుతూనే వున్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధితో పాటు మరెన్నో వ్యాధులకు ఈ ప్లాస్టిక్ భూతమే కారణం. ప్లాస్టిక్ తొందరగా మట్టిలో కలిసిపోదు, డ్రైనేజీ కాలువల్లో ఈ కవర్లు పడితే డ్రైనేజీ బ్లాక్ అవుతుంది. చెత్తకుండీల వద్ద పడివున్న వ్యర్థ ఆహారపదార్థాలతో పాటు ఈ ప్లాస్టిక్ కవర్లను మింగేయడం వల్ల ఆవులు మృత్యువాత పడుతున్నాయి. పర్యావరణానికి, ప్రజల ప్రాణాలకు చేటుగా మారిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిషేధించాలని గతంలోనే సుప్రీంకోర్టు ఆదేశించింది. 40మైక్రాన్లలోపు ప్లాస్టిక్ కవర్లు అమ్మకూడదని ప్రభుత్వం కూడా నిషేధం పెట్టింది. అయితే నెల్లూరులో ప్లాస్టిక్ నిషేధం అమలు కావడం లేదు. గతంలో నాలుగైదు సార్లు దాడులు నిర్వహించి, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకుపోవడం తప్పితే పకడ్బందీగా అమలు చేసిన దాఖలాలు లేవు. ముందు ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల ఉత్పత్తులను నిలిపేయాలి. దుకాణాలలో గుడ్డసంచులు లేదా జనపనార సంచులు మాత్రమే అమ్మాలి. నిషేధించిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను అమ్మే లేదా వాడే వ్యాపార దుకాణాలపై గట్టి చర్యలు తీసుకోవాలి. అధికారులతో తరచు తనిఖీలు నిర్వహిస్తుంటే ప్రజలు కూడా క్రమక్రమంగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని తగ్గించుకుంటారు.

# సేద్యంలో మెట్ట ఇక దిట్ట

## - వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి

కండలేరు నుంచి 62కోట్ల రూపాయలతో ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకం ద్వారా మెట్టప్రాంతమైన పొదలకూరు మండలాన్ని టిపి గూడూరు, ఇందుకూరు పేట తదితర డెల్టా ప్రాంతాలతో సమానంగా సాగుచేయడం గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 11న సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం మండలం, పాలిచెర్లపాడు చెరువుకు తెలుగుగంగ నీటిని విడుదల చేసిన అనంతరం జరిగిన బహిరంగసభలో మంత్రి మాట్లాడుతూ, 1987లో గత ప్రభుత్వాలు ముందుచూపుతో కండలేరు రిజర్వాయర్‌ను ఏర్పాటు చేశాయని, ఇప్పుడు కండలేరు రిజర్వాయర్ ద్వారా 5 నియోజకవర్గాల్లో 274 చెరువుల నుండి 80వేల ఎకరాలకు సాగునీరు అందించడం జరిగిందన్నారు. మెట్టప్రాంతంలో సాగుకు అవకాశం ఏర్పడడం ద్వారా భూమి రేటు రెండున్నర శాతం అధికంగా పెరిగిందని, సోమశిల రిజర్వాయర్ కింద 5లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. కండలేరు నుంచి హైలెవల్ కెనాల్ ద్వారా నీరందించాలంటే కండలేరు జలాశయంలో 33టిఎంసిల నీరు ఉన్నప్పుడు మాత్రమే సాధ్య పడుతుందని, వర్షాభావం దృష్ట్యా 33 టిఎంసిల నీరు నిల్వ ఉంచడం అసాధ్యమైన నేపథ్యంలో కండలేరు ఎడమకాలువ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. సంగం, పెన్నా బ్యారేజీ పనులను పూర్తిచేసి త్వరలో ప్రారంభిస్తామన్నారు. వెంకటాచలం మండలంలో సుమారు కోటీ 36లక్షలతో సిసిరోడ్లు, త్రాగునీటి వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, కోట-వాకాడు తదితర ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు అదనంగా 5టిఎంసిల నీటిని విడుదల చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు చంద్రనాయక్, ఏఎంసి ఛైర్మెన్ మధురెడ్డి, జడ్పీటిసి ఇ.సురేష్‌రెడ్డి, కె. కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత, పాలిచెర్లపాడు ఎస్‌సి కాలనీలో ఆరున్నర లక్షలతో ఏర్పాటుచేసిన అంగన్‌వాడి స్కూల్ భవనంతో పాటు పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు.



పాలిచెర్లపాడు చెరువుకు తెలుగుగంగ నీటిని విడుదల చేస్తున్న మంత్రి సోమిరెడ్డి

# దళితవాడల్లో రూ.70కోట్లతో అభివృద్ధి పనులు




సభలో మాట్లాడుతున్న టిడిపి రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని దళితవాడల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.70కోట్ల నిధులు మంజూరయ్యాయని నెల్లూరురూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 13న నెల్లూరు 3వ డివిజన్ నవలాకులతోట పరిధిలోని దీనదయాళ్‌నగర్‌లో దళిత తేజం - తెలుగుదేశం కార్యక్రమంలో ఆదాల పాల్గొని మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలోని దళితుల సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. దళితవాడల్లో ప్రతి ఇంటి ముందు సిమెంటురోడ్డు, డ్రైనేజీలను ఏర్పాటు చేస్తామన్నారు. పేద ప్రజలు నివసించే అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి చేపట్టేందుకు ఎల్లప్పుడూ తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం చంద్రన్న బీమా కార్డులను అందజేశారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనూరాధ, హరిబాబుయాదవ్, కార్పొరేటర్లు పొత్తూరి శైలజ, మామిడాల మధు, పొత్తూరి అచ్చెయ్యనాయుడు, నుడా డైరెక్టర్ ఖాజావలి, ఝాన్సీలక్ష్మి, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సునీల్‌కుమార్, నగర అధ్యక్షులు మాతంగి కృష్ణ, స్వర్ణా వెంకయ్య, ఏసునాయుడు, హరి, అనూష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో రాజు!



రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొడుకు, సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి ఆటోవాలా అవతారమెత్తాడు. తండ్రి చంద్రమోహన్‌రెడ్డి ఖర్చుల క్రింద పాకెట్ మనీ ఇవ్వలేదని ఆటోను తోలుకుంటున్నారనుకుంటారో ఏమో... అదేమీ కాదు. 12వ తేదీ నెల్లూరు ఆదిత్యనగర్‌లోని తన ఆఫీసులో ఆయనుండగా, ఆయన సహకారంతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆటోను తీసుకున్న ఓ యువకుడు ఆయన వద్దకు ఆటోను తీసుకొచ్చాడు. తన ఆటోను రాజగోపాల్‌రెడ్డే మొదట నడపాలని పట్టుబట్టడంతో... అతని కోరికను తీరుస్తూ... రాజగోపాల్‌రెడ్డి ఇలా ఆటో ఎక్కి ఆదిత్యనగర్‌లో రౌండ్లు కొట్టాడు.

# క్రీడలు... మానసిక వికాస వీచికలు

## • ఉత్సాహంగా ప్రైవేట్ స్కూళ్ళ విద్యార్థుల ఆటల పోటీలు

నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు రెండురోజుల పాటు క్రీడాపోటీలు జరిగాయి. ఈ నెల 10న ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక మంత్రి డా.పొంగూరు నారాయణ పాల్గొని మాట్లాడారు. శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని, చదువులకే పరిమితమైన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. పాఠశాల మైదానాల్లో జరిగే క్రీడలే కాకుండా, ఇంకా డ్రాయింగ్, వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్ వంటి పోటీలు కూడా నిర్వహించడం వల్ల పిల్లల్లో మేధస్సును మెరుగుపరిచేందుకు దోహదం చేసినట్లవుతుందని మంత్రి సూచించారు. దేశంలో క్రీడలంటే ముందుగా ఆంధ్రప్రదేశ్ గుర్తుకొస్తుందని, క్రీడలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొని పచ్చజెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా అధ్యక్షురాలు




విజేతకు బహుమతినందజేస్తున్న మంత్రి నారాయణ

టి.అనూరాధ, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు మేకల రజని, రాజానాయుడు, జిల్లా క్రీడల అధికారి పివి రమణయ్య, అపస్మా జిల్లా అధ్యక్షుడు మైథిలి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రతినిధులు ఎంవి సుబ్బారెడ్డి, నగర అధ్యక్షుడు ఎం.శేషారెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకటరామయ్య, కోశాధికారి సిహెచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

## - మంత్రి పి. నారాయణ



నెల్లూరుకు గత ఏడాది 3675 ఇళ్లను మంజూరు చేశామని, ఆయా లబ్దిదారుల సమస్యలను సత్వరం పరిష్క రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా. పి.నారాయణ అన్నారు. ఈ నెల 11న నెల్లూరు నగరంలోని ఏవిఎల్ రావు కల్యాణమండపంలో జరిగిన కార్య క్రమంలో గృహాలు మంజూరైన లబ్దిదారులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పేదల గృహనిర్మాణాల్లో లబ్దిదారులు పొజిషన్ సర్టిఫికెట్ లేదా పట్టాలు కలిగివుండాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి చెందిన రెవెన్యూ భూములనే గృహ నిర్మాణాల కింద లబ్దిదారులకు అందిస్తారని, దేవాదాయశాఖ, నీటిపారుదలశాఖల కింద ఉన్న నిరుపయోగమైన భూములను లబ్దిదారులకు అందించడానికి గల అవకాశాలను కూడా ముఖ్యమంత్రి పరిశీలిస్తున్నారని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు. పురపాలకశాఖ తరపున వస్తున్న సమస్యలకు సత్వర పరిష్కారం అందజేస్తున్నామన్నారు. అదేవిధంగా గృహ నిర్మాణాల సమస్యలను తీర్చడానికి ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటుచేస్తానని పేర్కొన్నారు. నగర మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, లబ్దిదారులతో ఇలా ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటుచేసి వారి సమస్యలు పరిష్కరించడం కోసం, తొలిసారిగా ఇలాంటి కార్యక్రమం ఏర్పాటుచేసిన మంత్రి నారాయణ అభినందనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి ఆదాల ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ, గృహ నిర్మాణాల్లో పొజిషన్ సర్టిఫికెట్లు లేనందువల్ల అనేకమంది ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, బిజెపి నాయకుడు కరణం భాస్కరరావు, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, శ్రీమతి టి.అనూరాధ పాల్గొన్నారు.

# పార్కుల్లో ఫాగింగ్ చేయాలి



హెల్త్‌ఆఫీసర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కోటంరెడ్డి యువసేన నాయకులు

నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలోని 29వ డివిజన్ చైతన్యపురిలో ఉన్న రెండుపార్కుల్లో దోమల నిర్మూలన కొరకు ఫాగింగ్ చేయాలని కోరుతూ కోటంరెడ్డి యువసేన అధ్యక్షుడు బి.విష్ణువర్ధన్ నెల్లూరు నగరపాలక సంస్థ హెల్త్‌ఆఫీసర్‌కు ఈ నెల 12న వినతిపత్రం సమర్పించారు. ఈ పార్కుల్లో ప్రతిరోజూ సీనియర్ సిటిజన్లు, మహిళలు వచ్చి వాకింగ్ చేసుకుంటూ ఉంటారని, పిల్లలు ఆటలాడుతూ ఉంటారని, దోమల బెడద వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోజుమార్చి రోజైనా ఫాగింగ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేషసాయిగౌడ్, ఖాదర్ మస్తాన్, హరి, కిరణ్, పవన్, కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ కులస్తులకు

# ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

## - కనకట్ల రఘురామ్ ముదిరాజ్

ముదిరాజ్ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తద్వారా తమ కులస్తులను, యువతను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కనకట్ల రఘురామ్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ నెల 12న నెల్లూరు ఆమని గార్డెన్స్‌లో నిర్వహించిన ముదిరాజ్ మహాసభ యువ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ దేశానికే వెన్నెముకైన యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు. యువతకు ఆయా ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధి అకాశాలను చూపాల్సిన అవసరం ఉందన్నారు. ముదిరాజ్ స్థితిగతులపై బీసీ కమిషన్‌కు నివేదిక పంపాలని సుప్రీంకోర్టు ఆదేశించినా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు పంపలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బిసి కమిషన్‌కు నివేదిక పంపాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామన్నారు. ఈ సమావేశంలో మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు కొర్నా నారాయణరావు, రాష్ట్ర కార్యదర్శి పివిఎల్‌రావు, జిల్లా అధ్యక్షుడు గుద్దేటి ఎల్లయ్య, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి బాలు శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి నారిబోయిన సురేష్, నగర అధ్యక్షుడు గుద్దేటి చెంచయ్య, ఉద్యోగుల విభాగం అధ్యక్షుడు చిరంజీవి, జిల్లా ప్రచార కార్యదర్శి పి.శ్రీహరి తదితరులు మాట్లాడారు.

# పోస్టల్ సేవింగ్స్ అండ్ ఇన్సూరెన్స్ మెగా మేళా

గూడూరు హెడ్‌పోస్టాఫీసు వారి ఆధ్వర్యంలో మంగళవారం డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో సేవింగ్స్ అండ్ ఇన్సూరెన్స్ మెగా మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ బాలసుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అత్యుత్తమ బీమా పథకా లలో పోస్టల్ శాఖ ముందుందని అన్నారు. దేశంలో ఉన్న ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలు అందించే సేవలకంటే అత్యుత్తమ సేవలు అందించే బీమా పథకాలు పోస్టల్ శాఖలో ఉన్నాయని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. స్థానిక పోస్టాఫీసు కార్యాలయం నుండి ఉద్యోగులు, ఏజెంట్లు భారీగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి డిఎన్ఆర్‌లో సమావేశం నిర్వహిం చారు. పోస్టల్ శాఖలో అమలులో ఉన్న పథకాలను సమావేశంలో ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ వీరభద్రన్, పోస్టల్ సూపరింటెండెంట్ వై. రాజు తదితరులు పాల్గొన్నారు.



పోస్టల్ సేవింగ్స్ బుక్‌ను అందజేస్తున్న చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ బాలసుబ్రహ్మణ్యం, వీరభద్రన్, వై.రాజు తదితరులు



## గూడూరు డివిజన్ వార్తలు

# మార్మోగిన శివనామస్మరణ...





మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 13వ తేదీ గూడూరు పట్టణంలోని భువ నేశ్వరిదేవి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవాలయం తెల్లవారు జామున నుంచే భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. మహి ళలు పెద్దసంఖ్యలో ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకు న్నారు. స్వామివారికి భక్తులు విశేషపూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే గూడూరు రెండవ పట్టణంలోని శ్రీ కామాక్షిదేవి సమేత ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. గూడూరు మండలంలోని చెన్నూరు, తిప్పవరప్పాడు, కొండాగుంట, వెడిచర్ల, మిట్టాత్మకూరు, నెల్లటూరు, మేగనూరు, విందూరు, వెందోడు, కందలి, బద్దెవోలు రోడ్డు, తదితర గ్రామాల శివాలయాలలో భక్తులు స్వామివారికి ప్రత్యేకపూజలు, అన్నదానాలు చేశారు. ఆలయాలలో శివ రాత్రి జాగారం సందర్భంగా పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించేలా చర్యలు

గూడూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకొంటామని గూడూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డేను సోమవారం నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన అర్జీదారులు భూసమస్యలు, రేషన్‌కార్డుల సమస్యలపై అర్జీలను అందించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీనివాసులు, విజయ్, విఆర్ఓలు, సిబ్బంది తదితరులు ఉన్నారు. కాగా, గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. గూడూరు డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన ప్రజలు సమస్యలపై ఆర్డీవోకు వినతిపత్రాలు అందించి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.




వెంకటగిరిలో ఇటీవల గూడూరు ఆర్డీవో చందర్ ఆధ్వర్యంలో ఎల్ఎల్ఆర్ మేళా నిర్వహించారు. 9వ బెటాలియన్, ఏపిఎస్‌పి, వెంకటగిరి కానిస్టేబుల్స్ మరియు ఇతర అధికారులకు 303 ఎల్ఎల్ఆర్‌లను ఆర్డీవో చందర్ అందజేశారు.

## ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా

# అన్నపూర్ణరావు

గూడూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా అన్నపూర్ణరావు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం బాధ్యతలను చేపట్టారు. సంగం మండలంలో ఎంపీ డీవో కార్యాలయంలో విధులు నిర్వహి స్తున్న ఆయన బదిలీపై గూడూరు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా నియమితులైనట్లు తెలిపారు. ఆయనకు పలువురు అధికారులు, నాయ కులు అభినందనలు తెలిపారు.

# ఆదిత్యలో ఆటలు

నెల్లూరు ఆదిత్యనగర్‌లోని ఆదిత్య విద్యాసంస్థల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిత్య కళాశాల ప్రాంగణంలో కళాశాల కరస్పాండెంట్ ఆచార్య ఆదిత్య వివిధ రకాల పోటీలను ఈనెల 10 నుండి మూడురోజుల పాటు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు విడివిడిగా షటిల్, బాడ్మింటన్, రింగ్‌బాల్, త్రోబాల్, కబడ్డీ, చెస్, క్రికెట్, వాలీబాల్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి.పుల్లయ్య, డైరెక్టర్ మంచికంటి కృష్ణారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ సుదర్శన్, లెక్చరర్లు రమేష్, శ్రీనివాసులు, అంకయ్య, కమలాకర్, శైలజ, గాయత్రి, నీరజ, విజేత పాల్గొన్నారు.





బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 16.2.2018 నుండి
తేది. 22.2.2018 వరకు

ఈ వారం కర్కాటకంలో రాహువు, తులలో గురువు, వృశ్చికంలో కుజుడు, ధనుస్సులో శని, మకరంలో కేతువు, కుంభంలో రవి బుధ శుక్రులు, కుంభ మీన మేషరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

19 తేది సోమవారం శుక్రమౌఢ్యమి సమాప్తము.

**ఫాల్గుణమాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 16 | శుక్ర | పాడ్యమి | రా॥ గం.3.13ని॥ |
| తేది. 17 | శని | విదియ | రా॥ గం.3.53ని॥ |
| తేది. 18 | ఆది | తదియ | రా॥ గం.4.01ని॥ |
| తేది. 19 | సోమ | చతుర్థి | రా॥ గం.3.40ని॥ |
| తేది. 20 | మంగళ | పంచమి | రా॥ గం.2.51ని॥ |
| తేది. 21 | బుధ | షష్ఠి | రా॥ గం.1.35ని॥ |
| తేది. 22 | గురు | సప్తమి | రా॥ గం.11.58ని॥ |

## మేషం



అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము

వ్యాపారాభివృద్ధి పథకాలు ప్రారంభిస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. వాహనాలు నడిపేటప్పుడు, యంత్రాలు, కరెంటు పని చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. ఋణాల పరిష్కారాలు జరుగుతాయి. చేపట్టిన పనులు సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఇతరుల విషయాలలో జోక్యం చేసుకొనవద్దు. ఉద్యోగులు మంచి గుర్తింపు గౌరవాలు పొందుతారు.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. వృత్తివ్యాపారాలలో అభివృద్ధికి అదనపు పెట్టుబడులు, కొత్త వ్యాపార ప్రయత్నాలు చేస్తారు. కొన్ని అనవసరపు ఖర్చులు తప్పనిసరి. సేవా సమాజిక రంగాలలో పాల్గొంటారు. శుభకార్య ప్రయత్నాలు జరుగుతాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు, ప్రభుత్వ అనుమతులు లభించగలవు.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థికంగా బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం పెరుగుదల ఉంటుంది. అయితే ఒక ముఖ్య అవసరానికి ఋణం చేయవలసి వస్తుంది. ఇంట, బయట వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు అవకాశాలు దొరుకుతాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయం ఖర్చులకు సంబంధముండదు. ఏదో ఒక రూపంలో ఖర్చు పెరిగిపోతుంది. వృత్తిజీవనం కలవారికి ఆదాయం కొంతమేలు. మంచి వ్యాపార అవకాశాలు తప్పిపోవచ్చును. అవసరాలకు మిత్రుల సహాయం లభిస్తుంది. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. బంధువర్గంతో అభిప్రాయ భేదాలుంటాయి. పనులు నిదానంగా జరుగుతూ టెన్షన్ పెడుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా జరుగుతాయి. ఆదాయం బాగుంటుంది. చర్చలు, ఒప్పందాల విషయంలో మెలకువగా ఉండాలి. స్థిరాస్తులు, కొత్త వస్తువులు సమకూర్చుకొనే ప్రయత్నాలు జరుగుతాయి. కోర్టు వ్యవహారాలు, రాజకీయ వ్యవహారాలలో పైచేయి సాధిస్తారు. శుభకార్య ప్రయత్నాలు వేగవంతమౌతాయి. రావలసిన బాకీలు కొంత లభించగలవు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉపాధి పథకాలు, చిన్న వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. అనుకున్న పనులు స్వల్ప ఇబ్బందులతో సాగుతాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. దూరప్రయాణాలు ఉండవచ్చును. పెద్ద మొత్తాల పెట్టుబడులు, అప్పులివ్వడం చేయవద్దు. ఉద్యోగులు అధికారులతో పబ్లిక్‌తో జాగ్రత్తపడండి. బిడ్డల ద్వారా శుభవార్తలు వింటారు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అప్పగించిన పనులను సమర్థవంతంగా జరుపుతారు. మీ మాటకు విలువ గౌరవం బాగుంటుంది. దూరప్రయాణాలుంటాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఉద్యోగులకు మంచి గుర్తింపు రివార్డులు ఉంటాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు. వృత్తి వ్యాపారాలు విస్తరించి ఆదాయం బాగుంటుంది. కొత్త పరిచయాలుండి ప్రయోజనం కలిగించగలవు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

తొందరపాటు మాటలు, ప్రవర్తన తగ్గించుకొనాలి. కుటుంబంలో భేదాభిప్రాయాలుండి సర్దుబాటు కాగలవు. చేపట్టిన పనులను నైతికంగా జరుపుకుంటారు. స్థిరాస్తుల లావాదేవీలు అనుకూలిస్తాయి. ఇంట బయట వ్యవహారాలను ఓపికతో పరిష్కరించుకొనాలి. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగి ఆదాయం బాగుంటుంది. అయితే కొద్దిపాటి అనవసర ఖర్చులుంటాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

బిడ్డల యొక్క విద్యా ఉద్యోగ వివాహ సమస్యలు కొంత ఆందోళన కలిగిస్తాయి. అవసరాలకు అప్పులు చేయవలసి రావచ్చును. బాకీలు నిలబడిపోతాయి. వృత్తి వ్యాపారాలు ఆశించినంతగా జరగకపోవచ్చును. సామాన్య ఆదాయం ఉంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఆశించిన సహాయం ముఖ్యవ్యక్తులు చేయకపోవచ్చు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆరోగ్య పరంగా జాగ్రత్త అవసరం. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా జరుపుతారు. అయితే ఎక్కువ టెన్షన్ పడుతుంటారు. ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. కొత్త కాంట్రాక్టులు లీజులు పొందుతారు. ప్రభుత్వ అనుమతులు పొందుతారు. వృత్తి వ్యాపారాలు వృద్ధిచెంది ఆదాయం పెరుగుతుంది. సమాజ, సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కొత్త వ్యాపారాలు, కొత్త కాంట్రాక్టులు పొందడం ఉంటుంది. అనుకున్న పనులు విజయవంతంగా జరుపుతారు. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. నిరుద్యోగులకు అవకాశాలు లభించగలవు. అనవసర విషయాలలో జోక్యం వద్దు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాలకై ప్రయాణాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఇంట, బయట వ్యవహారాలలోను, ఆర్థిక వ్యవహారాలలోను జాగ్రత్త అవసరం. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగి ఆదాయం తగ్గుతుంది. అదనపు ఖర్చు లెక్కువగా ఉంటాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. విద్యార్థులు మరింత కష్టపడాలి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. విద్యార్థులు మరింత కష్టపడాలి.

# టీడీపీ ఎంపీల దెబ్బకు వణికిన మోడీ

శ్రీను గల్పిక

అది ఢిల్లీలోని పార్లమెంటు భవనం. పార్లమెంటు బయట తెలుగుదేశం ఎంపీలు మాగంటి బాబు, తోట నరసింహం, గల్లా జయదేవ్, మురళీమోహన్, కేశినేని నాని, సుజనాచౌదరి, సీఎం రమేష్, కంభంపాటి రామ్మోహన్‌రావు, గరికపాటి మోహన్‌రావు తదితరులున్నారు. అందరి చేతుల్లోనూ 'ఆంధ్రాకు న్యాయం చేయండి' అంటూ తెలుగులో వ్రాసిన ప్లకార్డ్స్ వున్నాయి. అప్పుడే చిత్తూరు ఎంపీ శివప్రసాద్ వచ్చాడు. ఒంటిమీద చొక్కాలేదు. గోచీకట్టి చేతిలో కొరడా పెట్టుకుని పెద్దగా కేకలు పెడుతూ ఒళ్ళు వాతలు తేలేలా కొట్టుకోసాగాడు. తర్వాత రెండు పోల్స్‌ను రోడ్డుపై నిలబెట్టి వాటి మధ్య తాడు కట్టారు. శివప్రసాద్ ఆ తాడు మీద బ్యాలెన్స్ చేస్తూ నడిచాడు. ఈ ఫీట్లను చూస్తూ దారిన పోయే జనాలు ఎక్కడికక్కడ ఆగిపోయారు. తర్వాత ఆయన నిటారుగా నిలబెట్టిన కర్రపై పద్మాసనం వేసుకుని కొద్దిసేపు కూర్చున్నాడు. ఈ ఫీట్లన్నీ బ్రతుకుతెరువు కోసం పడుతున్న పాట్లేమోననుకున్న జనాలు తలో పదిరూపాయలు అక్కడ ధర్మం కింద వేసేసి పోసాగారు. అది చూసి తోట నరసింహం... ఓ శివప్రసాదన్నా, ఇక్కడ మనం బడ్జెట్‌లో ఆంధ్రాకు జరిగిన అన్యాయం మీద పోరాటం చేస్తున్నామని ఎవరూ అనుకోవడం లేదు. ఏదో సాపాటు కోసం చేస్తున్న ఫీట్లు అనుకుంటున్నారు. మనల్ని అడుక్కునే వాళ్ళు మాదిరిగా చూస్తున్నారు. ఈ పోరాడేదేదో పార్లమెంట్ హాల్‌లోకి వెళ్ళి పోరాడుదాం రండి... ఆ మోడీని, జైట్లీని నిలువునా కడిగేద్దాం పదండి అని అన్నాడు. అప్పుడు సుజనాచౌదరి.... ఆ అంటావ్... నీదేం పోయింది. పార్లమెంటు లోపల మోడీని గట్టిగా మాట్లాడితే ఆ తర్వాత ఎఫెక్ట్ వుండేది మా మీదే అని అన్నాడు. దానికి ఎస్వీవై రెడ్డి, బుట్టా రేణుక, కొత్తపల్లి గీతలు కూడా... అవును మీదేం పోదు... పార్టీ ఫిరాయించారని చెప్పి ముందు మా మీదే వేటు వేస్తారని తమ బాధ చెప్పుకున్నారు. అప్పుడు సీఎం రమేష్... పార్లమెంటు లోపల పోరాడాలంటే మోడీ భయం... అలాగని పోరాడకపోతే ఆంధ్రా ప్రజలు ఛీ కొడుతారు... ఎలా చేయాలబ్బా... ఈ సమస్యకు హైటెక్ మేధావి చంద్రబాబునాయుడే పరిష్కారం చూపగలడు అనుకుంటూ ఆయనకు ఫోన్ చేసాడు. చంద్రబాబు ఫోన్‌లోనే ఏదో ఐడియా చెప్పాడు. అది విని సీఎం రమేష్ సంతోషంగా ఫోన్ పెట్టేసాడు.

*****

పార్లమెంట్ సెంట్రల్‌హాల్... ప్రధాని నరేంద్రమోడీ, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, కాంగ్రెస్ అధినేత్రి సోనియా, రాహుల్, ఇంకా కేంద్రమంత్రులు, పలువురు ఎంపీలు వచ్చి కూర్చున్నారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ వచ్చి తన స్థానంలో కూర్చున్నారు. వైసిపితో సహా ఇతర పార్టీల ఎంపీలెవరూ సభలో లేరు. సభ మొదలైంది. టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ లేచాడు. అధ్యక్షా, ఏమనుకుంటున్నారు మా చంద్రబాబు నాయుడు గారి గురించి... మౌనంగా ఉంటున్నాడు కదా అని ముని అనుకుంటున్నారా? ఓటు-నోటు కేసులో ఇుక్కయ్యాడు, ఏం చేయలేడు అనుకుంటున్నారా? అగ్ని పర్వతం బద్దలైనా, చంద్రబాబు ఆవేశం కట్టలు తెంచుకున్నా మీరు నిలవలేరు. చంద్రబాబు మూడోకన్ను తెరవక ముందే మేలుకోండి... ఆంధ్రా పట్ల మీరు చేసిన తప్పును తెలుసుకుని వెంటనే న్యాయం చేయండి అని గద్దించాడు. గల్లా జయదేవ్ హెచ్చరికలతో మోడీ, జైట్లీలు బిక్క మొహం వేశారు. వారి రెండు చేతులు బిగుసుకుపోయి వణికిపోసాగాయి. వెంటనే సుజనాచౌదరి లేచాడు. ఏం తమాషాలు చేస్తున్నారా? చేతులకు గాజులు తొడుక్కున్నామనుకుంటున్నారా? మీరు కుక్కలకు బిస్కెట్లు వేసినట్లు మాకు నిధులిస్తే మేం తోక ఊపుకుంటూ తీసుకోవాల్నా? మీ ఆటలు, మీ డ్రామాలు ఇక కట్టిపెట్టండి. మా చంద్రబాబు నాయుడు తలచుకుంటే ఇప్పటికిప్పుడు కేంద్రంలో మీ ప్రభుత్వం కూలిపోతుంది. ఇంతకాలం మీరెంతగా అవమానించినా సహించాం... ఇక సమరం తప్ప, సహనం లేదు. ఇప్పటికైనా మీరు చేసిన తప్పును సరిదిద్దుకో లేదో 'ఖబడ్దార్' అంటూ గట్టిగా తొడ చరిచాడు. ఆ సౌండ్‌కు భయపడి మోడీ ఒక్క క్షణం గుండెను గట్టిగా పట్టుకున్నాడు. తర్వాత ఎంపీ ఎన్. శివప్రసాద్ లేచి శివాలెత్తాడు. ఇప్పటికైనా మించిపోయింది లేదు మోడీ... వెళ్ళి ఆ చంద్రబాబు శరణు కోరండి... ఆయన శాంతిలో కరుణామయుడు, దానగుణంలో దయామయుడు... చేసిన తప్పుకు వెళ్ళి ఆయనను క్షమాపణ కోరండి... లేదో భూమి ఆకాశాలు బద్దలవుతాయి అని హెచ్చరించాడు. వారి హెచ్చరికలతో జడిసి మోడీ, జైట్లీలు తమ స్థానాలలో నుండి లేచి సుజనాచౌదరి దగ్గరకు వెళ్ళారు. ఆయన చేతులు పట్టుకుని... చౌదరి గారూ... ఇప్పటిదాకా తెలిసో తెలియకో తప్పులు చేసాం... మా తప్పు తెలుసుకున్నాం. మీకు న్యాయం చేస్తాం... దయచేసి చంద్రబాబు గారిని మూడోకన్ను తెరవొద్దని చెప్పండి. ప్లీజ్... ప్లీజ్.... ప్లీజ్... అని వేడుకోసాగారు.

అప్పుడే సరిగ్గా కట్ కట్ కట్ అంటూ దర్శకుడు రాజమౌళి వచ్చాడు. అక్కడ ఆయనతో పాటు చంద్రబాబు, లోకేష్, మంత్రులు సోమిరెడ్డి, నారాయణ, పత్తిపాటి పుల్లారావులు కూడా వున్నారు. చంద్రబాబుతో రాజమౌళి... సార్, పార్లమెంట్ సీను బాగానే వచ్చింది, మన ఎంపీలు కూడా బ్రహ్మాండంగా యాక్ట్ చేశారు. అమరావతిలో పార్లమెంటు సెట్టింగ్‌కు నాలుగు కోట్లయ్యింది. ఇక మోడీ, జైట్లీ, సోనియా, రాహుల్ పాత్రల కోసం డూప్ యాక్టర్లను తెచ్చాం. వారి పోలికలకు దగ్గరగా వుండే ఆర్టిస్టులే దొరికారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ పాత్రధారికి పది లక్షలు, మిగతా ఆర్టిస్టులకు ఒక్కొక్కరికి ఐదు లక్షలు... అంతా బిల్లు 10కోట్ల దాకా కావచ్చని చెప్పాడు. అప్పుడు చంద్రబాబు... లోకేష్‌తో... సాయంత్రం ఈ సీన్ సి.డిలన్నింటిని ఏబిఎన్, ఎన్‌టివి, టీవీ 10.5, టీవీ 9×9=99, కళాజ్యోతి, ఏనాడులకు పంపించు.. పార్లమెంటులో విరగదీసిన తెలుగుదేశం ఎంపీలు... అని కథనాలు రావాలి అని చెప్పాడు. లోకేష్ వుండి... ఈ సీన్‌లో వైకాపా ఎంపీలు లేరు కదా నాన్నారు... చూసేవాళ్ళకు అనుమానం వస్తుందేమో అని ధర్మసందేహం వ్యక్తం చేశాడు. అందుకు చంద్రబాబు... ఆంధ్రాకు న్యాయం చేయాలని టీడీపీ ఎంపీలు పోరాడుతుంటే పత్తాలేకుండా పోయిన వైసీపీ ఎంపీలని వ్రాసుకో మనం అని చెప్పి అక్కడనుండి బయల్దేరాడు.

# శంభో శంకర...

## భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు




మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 13న నెల్లూరుజిల్లాలోని అన్ని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రముఖ శైవక్షేత్రాలు శివనామ స్మరణలతో మార్మోగాయి. భక్తులు పరమేశ్వరునికి అభిషేకాలు నిర్వహించేందుకు శివాలయాల్లో బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా ఆలయాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేశారు. నెల్లూరు మూలాపేటలో వేంచేసియున్న శ్రీ భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం, నవాబుపేటలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం, ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ కాశీవిశ్వనాథస్వామి దేవస్థానం, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామి దేవస్థానం, వాకాడు మండలం పంట్రంగంలోని శ్రీ కామాక్షి సమేత పాండురంగేశ్వరస్వామి దేవస్థానం, కొడవలూరు మండలం గండవరంలోని శ్రీ ఉదయకాళేశ్వరస్వామి దేవస్థానం, సంగం మండలం కామాక్షి సమేత సంగమేశ్వరస్వామి దేవస్థానం, విడవలూరు మండలం రామతీర్థంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం, అనంతసాగరం మండలం సోమశిలలోని శ్రీకామాక్షి సమేత సోమేశ్వరస్వామి దేవస్థానం, తడ మండలం వేనాడు శృంగేశ్వర శ్రీరంగపెరుమాళ్ళు దేవస్థానం, చేజర్ల మండలం కోటితీర్థంలోని శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత కోటేశ్వరస్వామి దేవస్థానం, దుత్తలూరు మండలంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం, ఉదయగిరిలోని లింగాలదొనలలో జరిగిన మహాశివరాత్రి వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అభిషేకపూజలు, లింగోద్భవాభిషేకాలు నిర్వహించారు. వేదాయపాలెంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ మహాశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పడారుపల్లి, తల్పగిరి కాలని, కొండాయపాలెం, నిప్పో సెంటర్‌లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాంధీనగర్ రోడ్డులోని విఘ్నేశ్వరాలయం వద్ద శివపార్వతుల కళ్యాణాన్ని నిర్వహించారు. నెల్లూరురూరల్ కోడూరుపాడులో శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీ పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. వేదాయపాలెం మహాత్మాగాంధీ నగర్‌లోని శ్రీ కృష్ణమందిరంలో మహాశివునికి లింగోద్భవ పూజలు, ప్రత్యేక పూలంగి సేవ, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. శివగిరికాలనీలోని సత్యసాయి ధ్యానమందిరంలో నజీర్‌బాషా గయాజీ ఆధ్వర్యంలో శివసంకీర్తన జరిగింది. వెంకటేశ్వరపురం శివాలయంలో జనార్ధన్‌రెడ్డి కాలని రోడ్డులోని శ్రీ అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి కళ్యాణం కనులపండువగా నిర్వహించారు.

# అవధూతల బోధనలు స్ఫూర్తిదాయకం

## - శ్రీ నారాయణదాసు దివ్యచరిత్ర గ్రంథావిష్కరణలో వక్తలు



యోగులు..అవధూతల జీవితాలు ఎంతో పుణ్యప్రదమైనవని, వారి బోధనలు ఎంతో స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. ఈ నెల 11వ తేదీన నెల్లూరు రేబాల లక్ష్మీనరసారెడ్డి(జూనియర్) స్మారక భవనం మిద్దెపైన  అవధూత శ్రీ నారాయణదాసు స్వామి (తుమ్మల తలుపూరు) వారి దివ్యచరిత్ర గ్రంథావిష్కరణ జరిగింది. 'లాయర్' ఉపసంపాదకుడు మద్దూరు శ్రీనివాసులు రచించిన ఈ గ్రంథాన్ని అవధూత శ్రీ నారాయణదాసు స్వామివారు ఆవిష్కరించారు. ఈ సభలో ఓయస్‌డి సిహెచ్ పెంచలరెడ్డి మాట్లాడుతూ, అవధూతలు నిత్యం భగవత్ ధ్యాసలోనే ఉంటారని, వారి జీవితాలు ఆదర్శనీయమైనవన్నారు. గ్రంథ ప్రచురణకర్త దువ్వూరు రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ, అవధూత శ్రీ నారాయణదాసు దివ్యచరిత్రను ప్రచురించడం ఆ భగవంతుని కృపేనని అన్నారు. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారికి, శ్రీ నారాయణదాసుస్వామివారికి భక్తునిగా ఉండడం తమ పూర్వజన్మ సుకృతమన్నారు. 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ, అవధూతల బోధనలు అనుసరణీయాలని, వారి జీవితాలు సమాజానికి మార్గదర్శకమని అన్నారు. గుడిలో కొలిచే దైవాలకు ప్రతినిధులుగా సజీవ రూపంలో ప్రత్యక్షంగా కనిపించే భగవత్ స్వరూపాలే అవధూతలని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన మోడరన్‌స్కూల్ అధినేత వాకాటి విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, అవధూతలు నిష్కల్మష హృదయులని, వారి జ్ఞానం అపారమని అన్నారు. స్వామివారి భక్తులైన కార్పొరేటర్ నూనె మల్లికార్జున యాదవ్, గోమతి స్కూల్ అధినేత్రి గోమతి అరుణ మాట్లాడుతూ, అవధూత శ్రీ నారాయణ దాసు స్వామివారంటే తమకెంతో భక్తి అని, వారెంతో మహిమాన్వితులని అన్నారు. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ కో-ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి మాట్లాడుతూ, నిరంతర భగవధ్యానంతో, గురునామస్మరణతో జీవించే అవధూత శ్రీ నారాయణదాసుస్వామివారి ఆశీస్సులను పొందగలగడం మనందరికీ మహద్భాగ్యమన్నారు. 'వార్త' ఎడిషన్ ఇన్‌ఛార్జి ఎం.వి చంద్రశేఖర్ తన స్వాగతోపన్యాసంలో అవధూత శ్రీ నారాయణదాసు స్వామివారి విశిష్టతను చక్కగా వివరించారు. అనంతరం, భక్తులందరూ పుష్పాలతో స్వామివారికి పాదపూజ నిర్వహించారు. గ్రంథ ప్రచురణకర్త దువ్వూరు రాధాకృష్ణారెడ్డిని, రచయిత మద్దూరు శ్రీనివాసులును, స్వామివారి శిష్యుడు ఎం.వి చంద్రశేఖర్‌ను అవధూత శ్రీ నారాయణదాసు స్వామివారి ఆశ్రమం తరపున స్వామివారి శిష్యులైన శ్రీ రామరాఘవయ్య ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్వామివారి భక్తులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, అవధాని కోట రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# సేవా ఉత్సవంగా.. వివాహ వార్షికోత్సవం



గర్భిణీ స్త్రీలను సారెలతో సత్కరించిన ఎంఎస్ఆర్ సేవా సమితి సభ్యులు

చిన్న వయస్సులోనే తన పేరుతో సేవాసంస్థను స్థాపించి నెల్లూరు నగరంలో ఏడాది పొడవునా ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి వ్యవస్థాపకులు మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందు) తన పెళ్ళి రోజును కూడా సేవాదినోత్సవంగా మార్చాడు. గర్భిణీ స్త్రీలకు సారెను అందించి వారిని తన తోబుట్టువులుగా ఆదరించాడు. ఈనెల 14వతేదీన తన వివాహ వార్షికోత్సవం సందర్భంగా నెల్లూరు మిట్టపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద 30మంది గర్భిణీ మహిళలకు పుట్టింటిసారెను అందించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు సాయిబాబా, కమతం అశోక్, దానా మహేష్, నౌషద్, మోష, నితిన్, ఆలీ పాల్గొన్నారు.

# డాక్టర్ రాజుకు ప్రతిష్టాత్మక ఫెలోషిప్



నెల్లూరుజిల్లాలోనేకాక చుట్టుపక్కల జిల్లాలలో గుండె వ్యాధిగ్రస్తులకు ఆప్తమిత్రుడు, పేరు మోసిన గుండెవ్యాధి వైద్యనిపుణులు, కిమ్స్(బొల్లినేని) ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చేజర్ల శేషశ్రీనివాసరాజుకు మరో అరుదైన పురస్కారం లభించింది. అమెరికాకు చెందిన సొసైటి ఆఫ్ కార్డియో వాస్క్యులర్ యాంజియోగ్రఫి ఇంటర్వెన్షన్ ఫెలోషిప్‌ను ఆయన అందుకోనున్నారు. ఏప్రిల్ 2వ తేదీన కాలిఫోర్నియాలోని శాండిగో పట్టణంలో జరిగే కార్యక్రమంలో ఆయన ఈ ఫెలోషిప్‌ను అందుకుంటారు. అలాగే మార్చి 11వ తేదీన ఫ్లోరిడా రాష్ట్రంలోని ఆర్లాండ్‌లో జరిగే కార్యక్రమంలో అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ ఫెలోషిప్‌ను అందుకోనున్నారు. ప్రతిష్టాత్మకమైన ఫెలోషిప్‌లను అందుకోనున్న డాక్టర్ రాజుకు 'లాయర్' అభినందనలు.

# పరిణీత టైటిల్ గెలుచుకున్న శ్రీరేఖ



ఈ నెల 11వ తేదీన నెల్లూరు, పప్పులవీధిలోని జేసీస్ భవన్ నందు జేసీఐ, నెల్లూరు ఆధ్వర్యంలో 'పరిణీత - 2018' కార్యక్రమాన్ని ఎంతో ఆకర్షణీయంగా నిర్వహించారు. వివాహిత స్త్రీలకు సాంప్రదాయ చీరల పోటీ నిర్వహించారు. మొత్తం 30మంది మహిళలు వివిధ రాష్ట్రాల మహిళలు ధరించే చీరలతో ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ పోటీలలో ఏల్చూరు శ్రీరేఖ ప్రథమ స్థానంలో నిలిచి 'పరిణీత-2018' టైటిల్‌ను గెలుచుకున్నారు. అలాగే ఎస్.సౌజన్య ద్వితీయ స్థానాన్ని, జయశ్రీ మూడవ స్థానాన్ని సాధించారు. ఈ పోటీలకు అమృతవల్లి, రాధిక, జ్యోత్స్నలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. జేసీస్ అధ్యక్షులు పొత్తూరు సాయి, కార్యదర్శి జగన్మోహన్, కోశాధికారి చీతిరాల హరికిషన్, జేసీరేట్స్ ఛైర్‌పర్సన్ పొత్తూరు సంయుక్త, స్వప్న, సరిత, గుండ్లపల్లి మధు, కొత్తూరు సుకన్య, పద్మప్రియ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొత్త రిజిస్ట్రార్‌కు అభినందనలు



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య ఎ.దుర్గాప్రసాద్‌ను ఈ నెల 14న ఆయన ఛాంబర్‌లో యూనివర్శిటీ పరిశోధక విద్యార్థులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల పరిశోధనా అంశాలను అడిగి తెలుసుకున్నారు. పరిశోధక విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఫెలోషిప్‌లు వచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు జొన్నలగడ్డ సుధీర్, మధుసూదన్, రేవతి, శ్రీవైష్ణవి, శిల్ప, జాస్మిన్, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

# మార్చికల్లా ఉపాధి పనులు పూర్తి కావాలి


సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు

జాతీయ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను మార్చి 31నాటికి నూరుశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ ఉపాధిహామీ పథకం పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెల్టా మండలాలైన అల్లూరు, వెంకటాచలం, సంగం, కోట, వాకాడు, విడవలూరు, ముత్తుకూరు, టి.పి.గూడూరు, ఇందుకూరుపేట, కొడవలూరు, బుచ్చి, నెల్లూరు, కోవూరు మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ఇరిగేషన్‌శాఖ సమన్వయంతో ఎక్కడైనా కాలువలు, చెరువులు పనులు చేపట్టి ఉపాధికూలీల సంఖ్య పెంచాలన్నారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించి ఈరోజుకి 253 పనులను ఈ పదమూడు మండలాల నుండి పంపించడం జరిగిందని, నెల్లూరు, బుచ్చి మండలాలకు సంబంధించిన మండల ఇరిగేషన్ ఎ.ఇ.లు ఆశించిన స్థాయిలో పనులను ప్రతిపాదించడం లేదని, ఇదే పరిస్థితి కొనసాగితే సంబంధిత ఎ.ఇ.లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యన్ఆర్ఇజిఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పంపబడిన ప్రతిపాదనలు త్వరితగతిన మంజూరు చేయించుకొని, వారికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తి చేయాలన్నారు. పనుల అనుమతి నందు సాంకేతికపరమైన సమస్యలు వుంటే రాష్ట్ర స్థాయిలో సంప్రదించుకొని పరిష్కరించుకోవాలని డ్వామా పి.డి ని కోరారు. అలాగే నిర్దేశించిన లక్ష్యం మేరకు ఫాం పాండ్లు, వర్మి, నెడప్ కాంపోస్ట్‌ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలన్నారు. ఉపాధి కూలీల వేతనం ఎటువంటి పరిస్థితుల్లోనైనా 140 రూపాయలకు తగ్గకుండా ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని యన్ఆర్ఇజిఎస్ సిబ్బందిని ఆదేశించారు. ఫాం పాండ్లు 16వేలు ఇల్లా మొత్తం లక్ష్యం కాగా, 7,400 పూర్తి చేశారని, మిగతావి మార్చి 31వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. రానున్నది వేసవి కాలం కనుక ఉపాధి కూలీలకు షెడ్లు వేసి మజ్జిగ ప్యాకెట్లను అందించాలన్నారు.

ఈ సమావేశంలో డ్వామా పి.డి శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఎస్.ఇ ప్రసాదరావు, ఎపిడిలు, ఎంపిడిఓలు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి యోగా పోటీల్లో
# నెల్లూరీయుల ప్రతిభ

చెన్నైలోని మహాబలిపురం ఏబిఐటి కళాశాలలో ఈ నెల 11న ఆలిండియా యోగా మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన యోగా మాస్టర్ల ఛాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లూరీయులు ప్రతిభ చాటారు. పురుషుల 40 వయస్సు విభాగంలో నెల్లూరుకు చెందిన యోగా మాస్టర్ ప్రసన్నకుమార్ తృతీయ స్థానం సాధించారు. యోగా శిక్షకురాలు స్వప్నకు శ్రీరత్న, ప్రసన్నకుమార్‌కు శ్రీపతంజలి అవార్డులను అఖిల భారతీయ యోగా మాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లా క్రీడాయోగా అసోసియేషన్ అధ్యక్షుడు నిర్మలా నరసింహారెడ్డి అభినందనలు తెలిపారు.

## గుర్రాల రమణయ్యకు ప్రతిభా పురస్కారం



గుర్రాల రమణయ్య రచించిన "మాటముల్లు" కవితా సంపుటికి జనరంజక కవి ప్రతిభా పురస్కారం లభించింది. ఈ నెల 9న గుంటూరు బృందావన గార్డెన్స్ అన్నమయ్య కళావేదికలో జరిగిన ఈ సభలో గుర్రాల రమణయ్యకు శాలువ, జ్ఞాపికతో పాటు రూ.2వేలు నగదు పురస్కారంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, రావి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# రాజీనామాస్త్రం
(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేకహోదా ఉద్యమాలు జరుగుతాయి. మార్చి 1న రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట వైసిపి ఆధ్వర్యంలో ధర్నా, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలు జరుగుతాయి. మార్చి 5వ తేదీన వైసిపి ఎంపీలు, సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు ఢిల్లీలో ప్రత్యేకహోదా కోసం ధర్నా నిర్వహిస్తారు. 3వతేదీన జగనే తాను పాదయాత్ర చేస్తున్న చోటు నుండి జెండా ఊపి వీరిని ఢిల్లీకి సాగనంపుతారు. మార్చి 5వ తేదీ నుండి ప్రారంభమయ్యే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో వైసిపి ఎంపీలు పార్లమెంటు సభలో ఏపికి ప్రత్యేకహోదా కోసం పోరాటం చేస్తారు. ఏప్రిల్ 6వ తేదీ దాకా జరిగే సమావేశాలలో ప్రత్యేకహోదాపై కేంద్రం నుండి ఎటువంటి హామీ రాకపోతే, దానికి నిరసనగా వైసిపి ఎంపీలు సమావేశాల చివరిరోజున తమ రాజీనామాలను స్పీకర్‌కు ఇచ్చేసి రాష్ట్రానికి వచ్చేస్తారు. ఆ తర్వాత నుండి కూడా పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేకహోదా ఉద్యమాన్ని కొనసాగించేలా జగన్ వ్యూహారచన చేసారు.

ప్రత్యేకహోదా కోసం ఎంపీల చేత రాజీనామా చేయించాలని జగన్ చేసిన ప్రయోగం తిరుగులేని అస్త్రం. ఎంపీల చేత రాజీనామా చేయిస్తానని చెప్పి జగన్ బంతిని ప్రత్యర్థుల కోర్టులోకి కొట్టాడు. ఇప్పుడు ప్రత్యర్థులది కక్క, మింగలేని పరిస్థితి.

రాష్ట్ర భవిష్యత్ కోసం, రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేకహోదానే మేలైన మార్గమని భావిస్తూ జగన్ ఆఖరి పోరాటానికి సిద్ధపడ్డాడు. ప్రతిపక్ష నాయకుడే ఏపికి ప్రత్యేకహోదా కోసం ఇంతకు తెగించి పోరాడుతుంటే, ఇక ప్రజలు నమ్మి ఓట్లేసి గెలిపించి అధికారం అనుభవిస్తున్న చంద్రబాబు ఇంకెంత పోరాటం చేయాలి. కాని, చంద్రబాబు ప్రత్యేకహోదా పోరాటాన్ని ఎప్పుడో వదిలేసాడు. ప్రత్యేకప్యాకేజీయే చాలనుకున్నాడు. రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేకహోదా సంజీవని కాదని సలహా కూడా ఇచ్చాడు. ప్రత్యేకహోదా అనే అంశాన్ని ఆయన తన ఆలోచనలలో నుండి ఎప్పుడో తీసేసాడు. ఇప్పుడు బడ్జెట్‌లో ఏపికి నిధులివ్వలేదని ఏడుస్తున్నాడేగాని ప్రత్యేకహోదా గురించి మాట్లాడడం లేదు.

ఇంకో పక్క చంద్రబాబు సైగలతో పనిచేసే పవన్‌కళ్యాణ్ జేఏసీ అంటూ వాళ్ళు వీళ్ళ చుట్టూ తిరుగుతున్నాడు. ఆయనది ప్రత్యేకహోదా పోరాటమో, ఇంకెవరి కోసమన్నా ఆరాటమో అర్థం కావడం లేదు. ఆయన భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక ఏంటో కూడా తెలియదు. ఒకవేళ ఆయనకన్నా తెలుసోలేదో? వామపక్షాల వాళ్ళు మాత్రం మొదటినుండి ఏపికి ప్రత్యేకహోదాపై చిత్తశుద్ధితో వున్నారు. ఇప్పుడు వైకాపా నాయకత్వంలో వాళ్ళు కూడా ప్రత్యేకహోదా ఉద్యమాన్ని తీవ్రతరం చేసే అవకాశముంది.

మొత్తానికి జగన్ కొట్టిన దెబ్బకు చంద్రబాబుకు మైండ్ బ్లాక్ అయ్యిందాలి. ఆయన అటు తెగించి కేంద్రంతో పోరాడలేడు... ఇటు చేతులు కట్టుకుని జనం మధ్య పలుచన కాలేడు. ప్రత్యేకహోదా కోసం నోరు తెరవలేని పరిస్థితి. జగన్ మాత్రం ప్రత్యేకహోదా కోసమే ప్రత్యేకంగా పట్టుబట్టి ఉద్యమానికి పిలుపునివ్వడంతో రాష్ట్ర ప్రజలలో సైతం ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. ప్రత్యేకహోదాపై ఇక రాజీలేని పోరు సాగిస్తే... జగన్‌కు చెలగాటం... బాబుకు సంకటమే! హోదాపై అసలైన గేమ్ ఇప్పుడే మొదలైంది...!

# కొత్తదనంతో సవాళ్ళను అధిగమించొచ్చు

### ఇస్రో అధిపతి డాక్టర్ శివన్

సవాళ్ళు అధిగమించాలంటే మనందరిలో కొత్తదనం రావాలని, ప్రతిఒక్కరూ రెట్టింపు పనిచేసి, తక్కువ సమయంలో ఎక్కువ పని చేయాలని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) అధిపతి డాక్టర్ కె.శివన్ ఉద్యోగులకు సూచించారు. ఈ నెల 14న నెల్లూరుజిల్లా సూళ్లూరుపేటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్‌లో అధిపతి హోదాలో ఆయన మొదటిసారిగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎంఆర్ కురుప్ ఆడిటోరియంలో ఉద్యోగులతో సమావేశమై మాట్లాడుతూ మీ వెంట నేనున్నానని, అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తానని, మీరందరూ మీవంతు పాత్ర పోషించాలన్నారు. రేపటి పనిని ఈరోజే చేసి మరింత రెట్టింపు ఉండేలా చూడాలన్నారు. అనంతరం షార్ సంచాలకులు కున్హికృష్ణన్, నియంత్రణాధికారి, విజిలెన్స్ ఆఫీసర్ జెవి రాజారెడ్డి మాట్లాడారు. ఈ సమావేశంలో షార్ ఏజీ బద్రి నారాయణమూర్తి, డిడి వెంకట్రామన్, ఎంఎస్‌ఏ గ్రూప్ డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# షాదీమంజిల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి


జేసీ ఇంతియాజ్‌తో మాట్లాడుతున్న నెల్లూరురూరల్ నియోజకవర్గ మైనారిటీలు

నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని పేద ముస్లింలు షాదీమంజిల్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నో ఏళ్ళుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని, వెంటనే షాదీమంజిల్‌కు స్థలం కేటాయించాలని కోరుతూ నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్‌కు నెల్లూరురూరల్ నియోజకవర్గ మైనారిటీలు వినతిపత్రాన్ని ఈ నెల 12న అందజేశారు. షాదీమంజిల్ నిర్మాణానికి నిప్పో స్థలంలోగాని, నెల్లూరు నగరంలోని పబ్లిక్ పర్పస్ స్థలాలోగాని కేటాయించి పేద ముస్లింల సమస్యను పరిష్కరించాలని కోరారు.

# జె.ఏ.సి
(మొదటి పేజీ తరువాయి)

వాటిని పరిష్కరించాలన్న తపన ఉన్నవాళ్లే! అయితే రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాల కోసం కేంద్రంతో పోరాడడానికంటూ పవన్‌కళ్యాణ్ ఏర్పాటు చేసిన జేఏసీలో వీరు భాగస్వాములు కావడమే ఆశ్చర్యం కలిగించే విషయం.

పవన్‌కళ్యాణ్‌కు సినిమాలలో వేర్వేరు డైరక్టర్లు వుంటారు. కాని, రాజకీయాల వద్దకొచ్చేసరికి ఆయనకున్న ఏకైక డైరక్టర్ చంద్రబాబే! 2014 ఎన్నికల నుండి ఇప్పటిదాకా కూడా చంద్రబాబు చెప్పినట్లే ఆయన వింటూ వచ్చాడు. చంద్రబాబు రమ్మన్నప్పుడల్లా పవన్ బయటకొచ్చాడు. ఆయన చెప్పిన చోటల్లా సభలు, రాజకీయ యాత్రలు చేశాడు.

పవన్ జేపీసీని పెట్టి ఇప్పుడు చించేస్తాను, ఆరేస్తాను అంటున్నాడు. నాలుగేళ్ళుగా రాష్ట్ర ప్రజలకు అటు కేంద్రం, ఇటు తెలుగుదేశం ప్రభుత్వం అన్యాయాల మీద అన్యాయాలు చేస్తుంటే ఈ పవన్ ఏం పీకాడు. రైతుల నుండి బలవంతంగా భూములు లాక్కుంటుంటే, దళితులపై దాడులు జరుగుతుంటే, ప్రభుత్వ ఉద్యోగులనే అధికార పార్టీ నాయకులు జుట్టుపట్టి ఊడ్చి కొడుతుంటే ఈ పవన్‌కళ్యాణ్ ఎక్కడికి పోయాడు. ఈ నాలుగేళ్లలో చంద్రబాబు ప్రభుత్వాన్ని ఒక్కసారైనా ప్రశ్నించాడా? పోనీ ప్రత్యేకహోదా కోసం కేంద్రంతో నైనా గట్టిగా పోరాడాడా?

ఇతను చంద్రబాబు స్క్రిప్ట్ తయారుచేస్తే స్క్రీన్ మీదకొస్తాడు. ఆయన డైరక్షన్‌లోనే యాక్షన్ చేస్తాడు. ఇక నీ యాక్షన్ చాలు అనగానే వెళ్ళిపోతాడు. ఇంతవరకు కామన్‌మెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ అని పెట్టి ఏం పీకాడు... ఆ తర్వాత జనసేనను స్థాపించి ఏం వెలగబెట్టాడు. రేపు జేపీసీ కూడా అంతే! జేపీసీ అతని బుర్రలో నుండి వచ్చిన ఆలోచనకాదు. ప్రత్యేకహోదా విషయంలో తెలుగుదేశం ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారే వారందరినీ పవన్ వైపు డైవర్ట్ చేయడం కోసం చంద్రబాబు వ్రాసిన నాటకమే జేపీసీ. పవన్‌ను నమ్ముకుని జేపీసీ పేరుతో రోడ్ల మీదకు రావడమంటే దేనినో పట్టుకుని గోదారిని ఈదడమే. మేధావులు కూడా ఆలోచించుకోవాలి.

# బాబు టాప్ .. రాష్ట్రం ఫ్లాప్
(మొదటి పేజీ తరువాయి)

సీఎంలలో టాపర్‌గా నిలిచాడు. త్రిపుర సీఎం మాణిక్‌సర్కార్ చివరి స్థానాన్ని దక్కించుకున్నాడు. రాష్ట్ర విభజనతో ఏపి ఆర్థికంగా దెబ్బతింది. ప్రజల ఆదాయ ప్రమాణాలు పడిపోయాయి. ఈ సమయంలో చంద్రబాబు సంపద మాత్రం పెరిగింది. ఈ కిటుకేదో ప్రజలకు చెబితే వాళ్ళు ఆయన మార్గాన్నే అనుసరిస్తారు కదా! ఆస్తులపరంగా సీఎం నెంబర్‌వన్‌లో వుండి, అభివృద్ధిపరంగా రాష్ట్రం వెనుకబడిపోతే అది చంద్రబాబుకే నామోషీ అవుతుంది కదా!

# హరహర మహాదేవా!.. ఓం నమః శివాయ!

- టిఎస్సార్ ఆధ్యాత్మిక-కళాసేవతో పులకించిన విశాఖ
- శివనామ స్మరణలతో మార్మోగిన సాగరతీరం
- వైభవంగా మహాకుంభాభిషేకం.. కోటిలింగార్చన
- డా. కైకాల సత్యనారాయణకు 'విశ్వ నటసామ్రాట్' బిరుదు

*'హర హర మహాదేవా!..ఓం నమః శివాయ!..శరణం శరణం సదా శివా!...అంటూ శివనామ స్మరణలతో విశాఖ సాగర తీరం పులకించిపోయింది. ఎటుచూసినా భక్తజనసందోహం మధ్య ..మహాశివరాత్రి పర్వదినం రోజున పరమశివునికి నిండుభక్తితో నిర్వహించిన మహాకుంభాభిషేకం, కోటిలింగార్చన, అభిషేకాలను తిలకించి తరించిపోయింది. వెల్లువెత్తిన ఆధ్మాతికత్వంతో విశాఖ నగరం పరవశించిపోయింది. రాజ్యసభ సభ్యుడు, కళాబంధు.. అందరికీ ఆత్మీయుడైన డా.టి. సుబ్బరామిరెడ్డి నేతృత్వంలో అంగరంగ వైభవంగా జరిగిన ఆధ్యాత్మిక వేడుకలు అందరినీ భక్తిభావ సమన్వితులను చేశాయి. అటు ఆధ్యాత్మికానందంతో పాటు..ఇటు కళారంగంలో వెల్లివిరిసిన సంతోషం చూసి విశాఖ ప్రజలు ఆనంద తరంగితులయ్యారు. ఈ పర్వదిన శుభ సందర్భంలోనే ఎంతోమంది సినీ దిగ్గజాలు, కళాకారులు, పారిశ్రామిక ప్రముఖుల మధ్య విఖ్యాత సినీ నటుడు డా. కైకాల సత్యనారాయణకు టిఎస్సార్ ఆధ్వర్యంలో 'విశ్వ నటసామ్రాట్' బిరుదు ప్రదానం ఎంతో ఘనంగా జరిగింది.*





మనసంతా నిండిన భక్తిభావంతో.. వేలాదిమంది ప్రజలు ఒకే గొంతుతో 'హరహర మహాదేవా!...ఓం నమః శివాయ!..అంటూ బిగ్గరగా చేస్తున్న శివనామ స్మరణలతో విశాఖలోని బీచ్‌రోడ్డు మార్మోగిపోయింది. నగరమంతా ఎటు చూసినా భక్తజనమే.. సాగరతీరమంతా ఓ భక్తజన కెరటంలా ఉప్పొంగిపోయింది. రాజ్యసభ సభ్యుడు, కళాబంధు..సాక్షాత్తూ ఆ పరమశివునికి పరమభక్తుడైన డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి(టిఎస్సార్) సారధ్యంలో ఈనెల 13న జరిగిన మహాశివ రాత్రి మహోత్సవాలు విశాఖ ప్రజలకు కన్నుల పండుగ చేశాయి. ఆ సదాశివునికి ఎంతో భక్తిశ్రద్ధ లతో చేసిన పూజలు..ప్రార్ధనలు..అర్చనలు.. అభిషేకాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికానందం వెల్లువెత్తింది. అంబరాన్నంటే సంబరంగా.. అంగరంగ వైభవంగా జరిగిన మహాశివరాత్రి మహాకుంభాభిషేకాన్ని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ ప్రారంభించారు. టిఎస్సార్, స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి ఇద్దరూ కలసి, వేదపండితుల వేదమంత్రోచ్ఛాటనల మధ్య, మంగళవాయిద్యాల మధ్య..భక్తులు పెద్దపెట్టున చేస్తున్న శివనామ స్మరణల మధ్య..పరమ పవిత్రమైన నదీజలాలతో ఆ పరమశివుని అభిషేకించి ఎంతో వైభవంగా మహారుద్రాభిషేకం నిర్వహించారు. మహాశివరాత్రినాడు సాయం సమయంలో సాగరతీరంలో ధరిత్రి నుంచి మహాలింగం ఉద్భవించే అద్భుతమైన లింగోద్భవ దృశ్యాన్ని ఒక సినిమా సెట్టింగ్‌లా వేసి అందరికీ కన్నుల పండుగ చేయడం భక్తులందరినీ బాగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఇలాంటి మహనీయమైన దైవకార్యక్రమాలను ఎంతో అద్వితీయంగా నిర్వహిస్తున్న టిఎస్సార్‌ను శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి వారు ఎంతో ఆనందంగా అభినందించి ఆశీర్వదించగా, మరెందరో ప్రముఖులు టిఎస్సార్ ఆధ్యాత్మిక తత్వాన్ని, భక్తిభావాన్ని.. కళాసేవా నిరతిని కొనియాడారు.

అనంతరం, నవరస నటసార్వభౌముడు.. ప్రముఖ సినీనటుడు.. విలనీలో తనకు తనే సాటి అన్పించుకున్న మహానటుడు డాక్టర్ కైకాల సత్యనారాయణకు టిఎస్సార్ లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో 'విశ్వ నటసామ్రాట్' బిరుదును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ హీరో, యువరత్న డా. నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ, కళలు విరాజిల్లుతున్న చోటనే సిరి సంపదలు వెల్లివిరుస్తాయన్నారు. సుమారు 780 చిత్రాల్లో అత్యద్భుతంగా నటించిన డా.కైకాల సత్యనారాయణను సత్కరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా టిఎస్సార్ ఆధ్వర్యంలో టిఎస్సార్ లలిత కళాపరిషత్ ద్వారా అనేక ఆధ్యాత్మిక, సేవాకార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. సినీరంగంలో కైకాల చేసిన అద్వితీయమైన కృషికి ఈ బిరుదును డా. కైకాలకు బహుకరిస్తున్నట్టు టిఎస్సార్ పేర్కొన్నారు. ప్రముఖ సినీ నటుడు, ఎంపీ మురళీమోహన్ మాట్లాడుతూ, టి.సుబ్బరామిరెడ్డి అజాతశత్రువన్నారు. అన్ని రంగాలవారితో ఆయనకు మంచి సంబంధాలున్నాయన్నారు. ప్రముఖ సినీరచయిత పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ నగరం ప్రపంచంలోనే అత్యున్నతమైన నగరంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, విభిన్న రంగాల్లో విశిష్టమైన సేవలందిస్తున్న కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి సేవలు అపారమని, విశాఖ నగర ప్రజలకు ఈ కార్యక్రమాలు చిరస్మరణీయమని అన్నారు.

## ఈశ్వరశక్తి ఉన్నంతవరకు కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటా! - టిఎస్సార్



గత 30 ఏళ్ళుగా రాజకీయాలకు అతీతంగా విశాఖలో విభిన్నరంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజల్లో భక్తితత్వాన్ని మరింతగా పెంపొందించేందుకు, మన ఘనమైన భారతీయ సంస్కృతిని.. ఆధ్యాత్మిక తత్వాన్ని పరిరక్షించుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నామని, తనలో ఈశ్వరశక్తి ఉన్నంతవరకు ఈ కార్యక్రమాలు చేపడుతూనే ఉంటామని ఈ సందర్భంగా కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి ఎంతో ధీర గంభీర స్వరంతో అన్నారు. ఆ తర్వాత తన మనుమడు ఈ కార్యక్రమాలను కొనసాగిస్తాడన్నారు. మహాశివరాత్రి శుభాకాంక్షలు చెప్తూ, ప్రజలందరికీ ఆ పరమశివుని అనుగ్రహం కలగాలని, అందరూ సకల శుభాలతో, సుఖ శాంతులతో జీవించాలని టిఎస్సార్ మనసారా దీవిస్తూ.. ఆకాంక్షించారు.

## నాకెంతో సంతోషంగా ఉంది - డా. కైకాల సత్యనారాయణ



డా. కైకాల సత్యనారాయణ మాట్లాడుతూ, ఈ బిరుదుకు తాను అర్హుడిని కాకపోయినా తనను ఇలా ప్రపంచవ్యాప్తం చేయడం తనకెంతో గర్వకారణంగా ఉందని వినమ్రంగా అన్నారు. తన సినీజీవితాన్ని విశ్వవ్యాప్తం చేసి 'విశ్వ నటసామ్రాట్' బిరుదును సాగరతీరంలో తనకు ప్రదానం చేయడం తన జీవితానికి ధన్యత చేకూరినట్లయిందంటూ సంతోషం వ్యక్తం చేశారు.

## ఆకట్టుకున్న కళాప్రదర్శనలు



మహాకుంభాభిషేకం అనంతరం టిఎస్సార్ లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య, నాటక ప్రదర్శనలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి. డాక్టర్ శోభానాయుడు ప్రదర్శించిన 'శివతాండవం' కూచిపూడి నృత్య రూపకం, సాలూరు వాసూరావు బృందం ఆలపించిన భక్తి గీతాలు, గుమ్మడి గోపాలకృష్ణ దర్శకత్వంలో ప్రదర్శించిన 'శ్రీకృష్ణ రాయబారం' పౌరాణిక నాటకం అందరి ప్రశంసలందుకున్నాయి. వంకాయల మారుతీప్రసాద్ బృందం ప్రదర్శించిన 'రామాంజనేయ యుద్ధం', 'సత్యహరిశ్చంద్ర' నాటకాలు అందరి కరతాళధ్వనులందుకున్నాయి. ఈ కార్యక్రమాలకు కళారత్న అవార్డు గ్రహీత ఎంకెఆర్ ఆశాలత వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం, సినీ, కళా, సామాజిక రంగాల్లో విశేషమైన సేవలను అందిస్తున్న పలువురికి టిఎస్సార్ లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో సత్కారాలు చేసి 'శివశక్తి' అవార్డులను బహుకరించారు. ప్రముఖ కూచిపూడి నృత్యకళాకారిణి పద్మశ్రీ శోభానాయుడు, ప్రఖ్యాత రంగస్థలనటుడు గుమ్మడి గోపాలకృష్ణ, ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరు వాసూరావు, శ్రీనివాస యాదవ్, మారుతీప్రసాద్ తదితరులను ఘనంగా సత్కరించి అవార్డులను బహుకరించారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com